J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 19 9.10.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# టార్గెట్ జగన్

## అరెస్టే లక్ష్యంగా అడుగులు



- ప్రతీకారం తీర్చుకునే దిశగా చినబాబు
- మద్యం కుంభకోణం, వివేక హత్యలో వేళ్ళన్నీ జగన్ వైపే
- 'స్థానిక' పోరు కాగానే యాక్షన్‌కి వ్యూహం

**తర్జనభర్జనలు, ఊహాగానాలు, విశ్లేషణలు చర్చోపచర్చల అనంతరం మద్యం కుంభకోణం, వివేకానందరెడ్డి హత్య కేసుల్లో సంచలన అరెస్టులకి అధికారయంత్రాంగం తెరతీయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఈ రెండు ప్రధాన కేసుల్లో ప్రస్తుతం వేళ్ళన్నీ జగన్‌వైపే చూపిస్తుండడంతో ఆయన్ని అదుపులోకి తీసుకోవడం తథ్యమనే ప్రచారం జోరందుకుంది. తాజాగా వైఎస్సార్‌సీపీ నాయకులకు ఈడీ తాఖీదులు పెరిగిన వేళ తర్వాతి టార్గెట్ పెద్దతలే అంటూ అటు టీడీపీ నేతలు, ఇటు అధికారవర్గాల్లో చర్చ సాగుతుండడం గమనార్హం.**

గత వైఎస్సార్‌సీపీ హయాంలో భూకబ్జాలు, కుంభకోణాలు తామరతంపరగా పెరిగిపోవడంతో ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి భరతం పట్టే పనిని ప్రారంభించింది. 2019 -2024 మధ్య ఐదేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాల మాటున పెద్దఎత్తున ఆమ్యామ్యాల పర్వం సాగిందన్నది జగ(న్)మెరిగిన సత్యమే. జగనన్న కాలనీల కోసం పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసి వాటి ద్వారా ఎమ్మెల్యేలు కమీషన్లు పొందారనే ఆరోపణలు అప్పట్లో జోరుగా సాగాయి. గ్రూప్ ఉద్యోగుల నియామకాల్లో ప్రశ్నాపత్రం రూపకల్పన, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకుని అయిన వారికి గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలను దోచిపెట్టారని పలువురు తెలుగుదేశం నాయకులు విమర్శలు గుప్పించారు. ఇక నాడు-నేడు, వివిధ నీటి ప్రాజెక్టులు, పోలవరం నిధుల్లోనూ గోల్‌మాల్ చేసి పబ్బం గడుపుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో అప్పటివరకు ఉన్న ఎక్సైజ్ విధానాన్ని మార్చి తమ అనుయాయులకు లబ్ధి చేకూర్చేలా కొన్ని బ్రాండ్‌లనే విక్రయించారు. మద్యం రవాణాలోనూ అందినకాడికి దోచుకున్నారు. ఫలితంగా పదుల సంఖ్యలో నాయకులు, అధికారులు ఊచలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వై.ఎస్.రాజశేఖరరెడ్డి సోదరుడు, మాజీమంత్రి వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తొలుత గుండెపోటు అంటూ ప్రచారం చేసి వెనువెంటనే నారాసుర రక్తచరిత్ర పేరుతో చంద్రబాబు అండ్ కో ప్రోద్బలంతోనే హత్య జరిగిందనే విమర్శలు చేశారు. చివరికి ఈ కేసులో వివేకానందరెడ్డి కుమార్తె సునీత అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కోర్టుని ఆశ్రయించడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దీంతో వైఎస్సార్ కుటుంబానికి చెందిన వారే వివేకానందరెడ్డి హత్యకు కారకులయ్యారనే ప్రచారం సాగింది. అదే సమయంలో కేసు సీబీఐ కోర్టులోకి చేరడంతో విచారణ ముమ్మరమై అరెస్టుల పర్వం జోరందుకుంది.

### రెండు కేసులు.. లక్ష ప్రశ్నలు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాగిన రెండు కేసులు రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అందులో ఒకటి లిక్కర్ కుంభకోణం, అప్పటి వరకు ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఉన్న మద్యం షాపుల నిర్వహణను జగన్ ప్రభుత్వం ప్రభుత్వ పరిధిలోకి తెచ్చింది. ప్రభుత్వం తరపునే ఉద్యోగులను నియమించి విక్రయాలు

2లో





నెల్లూరు నగరం గొలుసుదొంగలకు అడ్డాగా మారుతోంది. మహిళల మెడల్లోని బంగారు దండలను అందినకాడకి తెంపుకుని దుండగులు పారిపోతున్నారు. గత కొద్ది నెలలుగా యధేచ్ఛగా ఈ దొంగతనాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఈనెల 7 ఒక్క బుధవారం రోజునే నెల్లూరులో మూడుచోట్ల గొలుసు దొంగతనాలు జరిగాయంటే, దొంగలు ఎంత పేట్రేగిపోతున్నారో అర్థమవుతుంది.

# గొలుసు దొంగలకి అడ్డాగా.. నెల్లూరు

## • పట్టపగలే, నట్టనడి రోడ్లలో దుండగుల జోరు

ఈనెల 7న నెల్లూరు నగరం నడిబొడ్డున ఎప్పుడూ బాగా రద్దీగా ఉండే చాకలివీధి మహలక్ష్మమ్మగుడి సెంటర్‌లో ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారు దండను తెంపుకునిపోయాడో దుండగుడు. ముఖానికి మాస్క్ పెట్టుకుని ఉన్న ఒక ముసుగువీరుడు హఠాత్తుగా వచ్చి, ఆ వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు సరుడును తెంపుకుని పరుగెత్తుతూ వెళ్ళి, కొద్దిదూరంలోనే బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో అగంతకుడితో కలిసి పరారయ్యాడు. బాధితురాలు లబోదిబో మంటూ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదుచేసుకుని, ఆ గొలుసుదొంగలను పట్టుకునేందుకు గాలింపుచర్యలు చేపట్టారు.

### చెంపమీద కొట్టి మరీ బంగారుదండ లాక్కెళ్ళాడు :

అదేవిధంగా, బాలాజీనగర్, రాంజీ నగర్ ప్రాంతాల్లోనూ బుధవారం నాడు గొలుసు దొంగతనాలు జరిగాయి. పట్ట పగలే నట్టినడిరోడ్ల మీదనే మహిళల మెడల్లోని బంగారు గొలుసులు తెంపుకుపోతున్నారు. రోడ్డుపై ఇద్దరు మహిళలు నడుస్తూ వెళ్తుంటే, ఓ దుండగుడు ఒక మహిళని గబుక్కున చెంపమీద కొట్టి, ఆమె తేరుకునేలోగానే ఆమె మెడలో ఉన్న బంగారు దండను లాక్కెళ్ళాడు.

మరోచోట ఓ మహిళ బంగారు దుకాణానికి వెళ్ళి నగలు కొనుక్కుని వెళ్తుంటే, ఆమె చేతిలోని బ్యాగును లాక్కెళ్ళారు. బాలాజీనగర్ పోలీసులు ఈ ఘటనలపై విచారణ ప్రారంభించారు. ఏదేమైనా, నగరంలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా దుండగులు ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నారు. నడిచిపోతున్నవారిని, దుకాణాల్లో ఉన్న మహిళలను ఏమార్చి, లేదా కొట్టి.. భయభ్రాంతులను చేసి మరీ బంగారు దండలు తెంపుకుపోతున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వెంటనే వీటిపై దృష్టిపెట్టి, ఇప్పటివరకు జరిగిన గొలుసు దొంగతనాల్లోని దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలి. నిఘా బృందాలను వెంటనే అప్రమత్తం చేసి, బరితెగించిపోతున్న గొలుసుదొంగల భరతం పట్టాలి. ఇలాంటి ఘటనలకు తావులేకుండా.. మహిళలు కూడా అప్రమత్తంగా ఉండాలి మరి!...

# టార్గెట్ జగన్

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టింది. తద్వారా కావాల్సిన స్టాకు, విక్రయించిన మొత్తం, మిగులు, ఏపి బ్రాండ్‌లు అమ్మాలి, ఏపి బ్రాండ్‌లను కొనుగోలు చేయాలి వంటి అంశాలన్నీ ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులే నిర్ణయించే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో తమకు కమీషన్లు ఇచ్చే సంస్థలకు సంబంధించిన బ్రాండ్‌లనే మద్యం షాపుల్లో విక్రయించి మిగిలిన వాటిని దూరంగా పెట్టేశారు. ఫలితంగా మద్యం ప్రియులకు అన్ని బ్రాండ్‌లూ అందుబాటులో లేకుండా పోయాయి. నాసిరకం మద్యం లోకల్ బ్రాండ్‌లను దుకాణాల్లో విక్రయించి దశాబ్దాలుగా చెలామణిలో ఉన్న నాణ్యమైన బ్రాండ్‌లను తుంగలో తొక్కేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక షాపులకు ఏపి బ్రాండ్‌లను తీసుకురావాలో సూపర్‌వైజర్లతోనే ఇండెంట్ ఇప్పించుకుని తమ వారి బ్రాండ్‌లను యథేచ్ఛగా విక్రయించారు. ఈ క్రమంలోనే రాజ్‌కెసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలజీ గోవిందప్ప, వాసుదేవరెడ్డి, కృష్ణమోహన్, ధనుంజయరెడ్డి వంటి వారి ఇళ్లల్లో ఈడీ సోదాలు జరగడమే కాకుండా కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక తాజాగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు కావడం, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డికి నోటీసులు రావడంతో మరోసారి ఈ కుంభకోణంలో అరెస్టుల పర్వం మొదలవుతుందనే ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా మద్యం రవాణా కోసం సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్టు వంటి సంస్థలతో సబ్ కాంట్రాక్టులను పొంది కారుమూరి సునీల్, విజయానందరెడ్డి వంటి వారు 200 కోట్ల వరకు ప్రభుత్వ నిధులను కొట్టేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ నోటీసులివ్వడం లిక్కర్ కేసులో సూత్రధారులు, పాత్రధారుల వ్యవహారంపై చర్చకు తావిచ్చింది.

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి దస్తగిరి, సునీల్‌యాదవ్ వంటివారు అప్రూవర్లుగా మారి ఈ హత్య ద్వారా పూర్తిస్థాయిలో లబ్ధిపొందిన వారు వైఎస్ జగన్, వైఎస్ భారతి, అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి మాత్రమేనని, తాము ఈ విషయాన్ని బహిరంగంగా ప్రకటిస్తున్నా సీబీఐ అధికారులు, ఈడీ అధికారులు తమనే టార్గెట్ చేస్తూ ముందుకు సాగడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. వివేక హత్య కేసులో రూ. 40 కోట్ల సుపారీ ఇచ్చే స్థాయి జగన్, భారతి, అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలకి మాత్రమే ఉందని, తమలాంటి వారికి అది సాధ్యమయ్యే పని కాదని వాళ్ళు తేల్చి చెప్తున్నారు.

### జగన్ అరెస్టే ధ్యేయంగా!

ప్రస్తుతం వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోను, ఏపీ మద్యం కుంభకోణంలోనూ నిందితుల గుట్టు రట్టయ్యి, అరెస్టులు జోరందుకోవడంతో మరోసారి జగన్‌ను ఈ కేసుల్లో అదుపులోకి తీసుకోవడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వంలో సీబీసీఐడీని అడ్డం పెట్టుకుని తన తండ్రి, టీడీపీ అధినేత చంద్రబాబును కక్షపూరితంగా జగన్ అరెస్టు చేయించారని, దీనికి బదులు తీర్చుకోవడం తథ్యమని లోకేష్ తన సన్నిహితుల వద్ద స్పష్టం చేసినట్లు సమాచారం. కేంద్ర పెద్దల ఆశీస్సులతో ఇన్నాళ్లు జగన్ తప్పించుకున్నారని, ఇకపై అది సాధ్యమయ్యే పని కాదని కూడా చెప్పినట్లు తెలిసింది. మద్యం కుంభకోణంలో రూ.3వేల కోట్లకు పైగా అక్రమాలు చోటు చేసుకోవడం, అందులో అంతిమ లబ్ధిదారు జగనే అంటూ గత కొన్నాళ్లుగా అటు చంద్రబాబు, ఇటు పవన్ కల్యాణ్, లోకేష్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఇక వివేకానందరెడ్డి హత్య కేసు వ్యవహారంలో రూ.40కోట్ల సుపారీ ముడుపులకు సంబంధించి తాజాగా ఈడీ అధికారులు అవినాష్‌రెడ్డికి నోటీసులిచ్చారు. ఈ క్రమంలో త్వరలోనే అవినాష్ రెడ్డిని కూడా ఈ కేసులో అదుపులోకి తీసుకుంటారని, ఆ తర్వాత వంతు జగన్‌దే అని స్పష్టం చేస్తున్నారు. అందుకు పూర్వ రంగాన్ని సిద్ధంచేసే క్రమంలోనే చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ వంటి వారు ఇటీవల కాలంలో వైఎస్సార్‌సీపీని గొడ్డలిపార్టీగా అభివర్ణిస్తూ మైండ్‌గేమ్ ప్రారంభించారనే ప్రచారం కూడా జోరందుకుంది. ఏదేమైనా రాష్ట్రాన్ని కుదిపేసిన రెండు ప్రధాన కేసుల్లో ప్రస్తుతం వేళ్ళన్నీ వైఎస్ జగన్ వైపే చూపిస్తున్నాయన్నది నిర్వివాదాంశం.

### 'స్థానిక' పోరు తరువాతే యాక్షన్!

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకి రంగం సిద్ధమవుతోంది. అతి త్వరలోనే స్థానిక యుద్ధానికి ఎన్నికల సంఘం తెరతీసేపనుంది. ఈ తరుణంలో జగన్ అరెస్టు వైసీపీకి లాభం చేకూరుస్తుందన్న ఆలోచనలో కూడా కూటమి నేతలు ఉన్నారని కూటమి శ్రేణుల సమాచారం. ఎలాగూ ఇన్నాళ్ల వేచివున్నాం, మరికొన్నాళ్లు ఆగుదాం అన్న భావనలో కూటమి పెద్దలు వున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. స్థానిక పోరు ముగిశాక యాక్షన్‌ప్లాన్ చేద్దాం అన్న నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ అంతర్గత వర్గాల వార్త. ఏదేమైనా అక్రమాస్తుల కేసులో ఇప్పటికే పుష్కర కాలానికి పైగా బెయిల్‌పై బయట ఉన్న జగన్ విషయంలో తాజాగా మరోసారి అరెస్టు అంశం మాత్రం రాజకీయ వర్గాల్లో పెద్దచర్చకే దారితీస్తోంది. మరి ఇది ఎప్పటిలా పుకార్లకే పరిమితమౌతుందా..? లేక నిజంగానే అదుపులోకి తీసుకుంటారా.. అనే విషయం స్థానిక పోరు ముగిసిన తరువాతే తేలనుంది.!

# పేదల సేవకే ప్రాధాన్యత ఇస్తాం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న షరణి

పేదల సేవకే తాము ప్రాధాన్యత ఇస్తామని మంత్రి నారాయణ కుమార్తె షరణి చెప్పారు. తమ నాన్న సేవా దృక్పథంలో భాగంగా నగరంలో కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరాలకు నగర ప్రజల నుండి అపారమైన స్పందన లభిస్తోందని ఆమె చెప్పారు. మంగళవారం 47వ డివిజన్ ములుముడి బస్టాండ్ సెంటర్ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. నెల్లూరు నగరవ్యాప్తంగా ఇప్పటివరకు విజయవంతంగా 130 వైద్య శిబిరాలను పూర్తి చేసుకుని, వేలాదిమంది పేద వర్గాలకు మెరుగైన ఉచిత వైద్యం అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సేవా యజ్ఞంలో ఇప్పటివరకు మొత్తం 13,484 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని, 7,410 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయగా, తీవ్రమైన కంటి సమస్యలు కలిగిన 177 మందికి అధునాతన శస్త్రచికిత్సలు చేసి మళ్లీ దృష్టిని ప్రసాదించడం జరిగిందని చెప్పారు.

# విశ్వసాయిలో గాంధీ జయంతి




గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ఛైర్మన్ డా. సత్యనారాయణ, సిబ్బంది

అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని విశ్వసాయి కళాశాలలో వేడుకలు జరిగాయి. కళాశాల డైరెక్టర్లు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన నాయకుల్లో గాంధీజీ అగ్రగణ్యులని, జాతిపితగా బాపూజీ దేశవ్యాప్త ఖ్యాతిని పొందారని కళాశాల ఛైర్మన్ డా. ఎన్. సత్యనారాయణ తెలిపారు. వైస్ ఛైర్మన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, అక్టోబరు 2న గాంధీజయంతితో పాటు, స్వాతంత్ర్య సమరయోధులు లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ శివ సంకేత్, ప్రిన్సిపాల్స్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంగీతం, గానం..అపురూపమైనవి

## 'గానం అకాడమీ' సభలో వక్తలు



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో ముఖ్యఅతిథులు

సంగీతం, గానం అపురూపమైనవని పలువురు వక్తలు వాటి విశిష్టతని వివరించారు. ఈనెల 3న నెల్లూరులోని 'సద్గురు గానం అకాడమీ' అధినేత్రి..ప్రముఖ సంగీత కళాకారిణి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన 'గానవర్థిని' సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో ప్రముఖ గాయని ఎస్వీ శైలజ, చెన్నైలోని ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు ఎస్.రాజేశ్వరి, డా.నిత్యశ్రీ మహాదేవన్ పాల్గొని గానం అకాడమీ చిన్నారుల శాస్త్రీయ సంగీతాన్ని, వారు ప్రదర్శించిన నృత్యాలను తిలకించి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్థన్‌రెడ్డి, ఆదిశంకర విద్యాసంస్థల వ్యవస్థాపకులు డా. వంకి పెంచలయ్య, 'శుభమస్తు' అధినేత బయ్యా వాసు, ప్రముఖ గాయని ఎస్వీ వసంత, ఎస్వీ పార్వతి, కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, కళాంజలి అనంత్ తదితరులు పాల్గొన్నారు. దువ్వూరు బెనర్జీ సభకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# కరాటేలో 'కళాదీప్తి' చిన్నారులకు బహుమతులు




అవార్డులందుకుంటున్న ఆదిత్య, లక్ష్మీతేజ

నెల్లూరు రంగనాయకుల పేటలోని కళ్యాణమండపంలో ఈనెల 4న జరిగిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్-2026 పోటీలో స్థానిక 'కళాదీప్తి' ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన అన్నాచెల్లెళ్లయిన ఇద్దరు చిన్నారులకు బహుమతులు లభించాయి. 6వ తరగతి చదువుతున్న డి.ఆదిత్యగుప్తా ద్వితీయ బహుమతి, 1వ తరగతి చదువుతున్న చిన్నారి డి.లక్ష్మీతేజకి కన్సొలేషన్ బహుమతి సాధించారు. వీరిద్దరూ కళాదీప్తి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో నృత్యం, కరాటేలలో శిక్షణ పొందుతున్నారు. జాతీయస్థాయి కరాటేలో వీరు బహుమతులు పొందడం పట్ల ఆ సంస్థ నిర్వాహకులు 'కళాదీప్తి' సుబ్రహ్మణ్యం తదితరులు వారిని అభినందించారు.

# గుడిసెలో పుట్టా!..పేదరికం అనుభవించా!

## • గతం గుర్తుచేసుకున్న మంత్రి నారాయణ


చిన్నారులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న మంత్రి నారాయణ, శరణి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

తాను గుడిసెలో పుట్టానని, పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు.. జీవితంలో అనుభవించానని, అందుకే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నానని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజల ఇళ్లకు వెళ్లినప్పుడు ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేకపోతున్న నిరుపేద విద్యార్థుల పరిస్థితులను ప్రత్యక్షంగా చూశానని, వారికి నాణ్యమైన విద్య అందిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని చెప్పారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం స్టోన్‌హౌస్ పేటలోని ఆర్‌ఎస్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సదస్సులో మంత్రి మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు షరణితో కలిసి పాల్గొన్న మంత్రి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. తాటాకుల గుడిసెలో పుట్టి, కష్టాల్లో పెరిగానని చెప్పారు. తన తండ్రి ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి తెచ్చిన జీతంతోనే కుటుంబం గడిచేదని తెలిపారు. హరనాథపురం నుంచి వీఆర్‌సీ వరకు కాలినడకన వెళ్లి చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నానని, కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. అందుకే పేద విద్యార్థులకు విద్య అనే శాశ్వత ఆస్తిని పంచాలని నిర్ణయించుకున్నానన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 23 ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని ఆయన వెల్లడించారు.

# వైసీపీ మేయర్ అభ్యర్థిగా.. ఆనంకి స్థానం



నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పదవి ఓసీ జనరల్‌కు కేటాయించే పక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. అయితే, మేయర్ పదవికి సంబంధించిన తుది రిజర్వేషన్ ఇంకా ఖరారు కాలేదు.

నెల్లూరు రాజకీయాలతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ఆనం కుటుంబానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి కొంతకాలంగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తొలుత కాంగ్రెస్‌లో పనిచేసిన ఆయన 2016లో వైసీపీలో చేరారు. 2017లో నెల్లూరు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా కొనసాగుతూ, 2024లో నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన సతీమణి ఆనం అరుణమ్మ ఇటీవల వరకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కొనసాగి, సమయం ముగిసిపోవడంతో మాజీగా మారారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డి పేరును ముందుగానే ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. నగరంలోని 72 డివిజన్లలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల బరిలోకి వెళ్లేందుకు వైసీపీ కసరత్తు ప్రారంభించినట్లయింది. మేయర్ రిజర్వేషన్ తుది రూపుదాల్చిన తర్వాతే అభ్యర్థిత్వంపై పూర్తి స్పష్టత రానుంది.



# విజయవాడ ఉత్సవానికి రండి

## • విజయ్‌ని ఆహ్వానించిన మాగుంట

అక్టోబర్ 11 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి సంబరాల తరుణంలో విజయవాడలో జరగనున్న 'విజయవాడ ఉత్సవ్'కి రావాల్సిందిగా తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్‌ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆహ్వానించారు. అక్టోబర్ 6వ తేదీ మంగళవారం ఆయన చెన్నైలో విజయ్‌ని కలిశారు. మాగుంట వెంట విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), అమలాపురం ఎంపీ జి.ఎం.సి. హరీష్ బాలయోగి కూడా వున్నారు.

# ఎన్నికల కమిషన్‌వి ఏకపక్ష నిర్ణయాలు

## • రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్, ప్రజాసంఘాల విమర్శ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ నేత కిరణ్‌కుమార్‌రెడ్డి

ఎన్నికల కమిషన్‌వి ఏకపక్ష నిర్ణయాలుగా ఉన్నాయని, ఓటుహక్కు సంరక్షించుకునేందుకు అందరం కలిసి పోరాడాల్సి ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 7న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ప్రజాసంఘాల నాయకులతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని, ఎన్నికల కమిషన్ తీరు దారుణమని చెప్పారు. దేశంలో రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలన్నారు. సర్ ప్రక్రియ ద్వారా దేశంలో సుమారు 13 కోట్ల ఓట్ల రద్దుకు సంబంధించి విచారణ జరపాలని, సీఈసి జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు అరిగెల సాయి, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు డాక్టర్ యశోధర, పలువురు న్యాయవాదులు, వామపక్ష సంఘాల నాయకులు పాల్గొన్నారు.




లాయర్
అక్టోబరు 09, 2026

# డిజిటల్ వ్యవస్థ.. బాలికలకు కొత్త అవస్థ!

సాధారణంగా కాలం గడిచేకొద్దీ సమస్యలు సమసిపో తుంటాయని అనుకుంటుంటారు. కానీ, కాలంతో పాటు కష్టాలు మారిపోతున్నాయే తప్ప బాలికలకు మాత్రం సమ స్యలు తీరడం లేదు. సరికదా, కొత్త బాధలు తలెత్తుతూనే ఉన్నాయి. చేతికి సెల్‌ఫోన్లు, అందుబాటులోకి కంప్యూటర్లు.. నెట్‌లూ.. డిజిటల్ వ్యవస్థలూ అన్నీ వచ్చేసి ఆధునిక జీవితాన్ని నెట్‌మయం చేశాయి. పాతకాలంలో వలె పలకాబలపం పట్టుకుని ఓనమాలు రాసే రోజులు పోయాయి. అంతా కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లలోనే. రాతలు, మాటలు పాటలు అన్నీ అవే నేర్పిస్తాయి. మారుతున్న కాలానికి తగ్గట్టుగా మారకపోతే, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుంటుంది. అందులోనూ నేటికాలంలో మెరికల్లాంటి యువత సాంకేతి కతను బాగా వంటపట్టించుకుని, మంచి ఉద్యోగాలు కూడా సంపాదిస్తున్న వారూ ఉన్నారు. అన్నిరంగాల్లో డిజిటల్ వ్యవస్థదే ఇప్పుడు రాజ్యం. విద్యావ్యవస్థలోనైతే, చిన్నపిల్లల స్థాయి నుంచి కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌ల వాడకం అలవాటై పోయింది. డిజిటల్ విద్య లేకుంటే భవిష్యత్ ఉండదని అందరూ అనుకుంటున్నారు. అందులోనూ ఇప్పుడు కృత్రిమ మేథ కాలం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై అవగాహన లేకపోతే, ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు చేసే సాంకేతిక పరిజ్ఞానం కొరవడితే, ఉద్యోగాలు కాదు కదా కనీసం ఇంట ర్వ్యూల దాకా కూడా వెళ్ళలేం అంటున్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ విద్య అందరికీ తప్పనిసరి అవుతోంది. అయితే, ఈ అధునాతన పరికరాలన్నీ వచ్చేశాక రకరకాల మోసాలు, డేటా చోరీలు, ఖాతాల్లోని డబ్బు మాయమవడాలు, ఆడపిల్లలకి ఆన్‌లైన్ వేధింపులు వంటివి కూడా ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా, పది నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న కోట్లాదిమంది బాలికలకు రోజురోజుకీ సరికొత్త చిక్కులు ఎదురవుతూనే ఉన్నాయి. తెలిసీతెలియని వయసు, అమాయ కత్వం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన దిశలో అందుకునే వెసులుబాటు లేకపోవడం వల్ల మనదేశంలో లక్షలాదిమంది బాలికలు సైబర్ నేరాల బారిన పడుతున్నారు. సాంకేతికతను ఎలా ఉపయోగించాలో చెప్పేవారు లేక, ఎవరిని ఏమని అడగాలో తెలియక బాలికలు తరచూ మోసపోతూనే ఉన్నారు. బాలికలకు సాంకేతిక జ్ఞానం లేదనే బలహీనతలనే ఆసరగా చేసుకుని సైబర్ మోసగాళ్లు, ఆన్‌లైన్ వేటగాళ్ళు అమాయక బాలికలను సునాయాసంగా మాటలతోనే బురిడీ కొట్టించేస్తు న్నారు. నెట్‌లు వచ్చాక, బాలికలకు ఆన్‌లైన్‌లో మంచేదో చెడేదో తెలియకపోవడం వల్ల..అపరిచితులతో స్నేహాలు, అపరిమిత మాటలు అలవాటుచేసుకుంటున్నారు. నిజజీవి తంలో నిజమైన స్నేహితులకంటే ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌లే ఎక్కువై పోతున్నాయి. ఫోన్ నంబర్లను అపరిచితులకి ఇచ్చేయడం, ఫోటోలను షేర్ చేసుకోవడం, ఫోన్‌లలో రకరకాల గేమ్స్ ఆడడం, వాటివల్ల డబ్బులు వస్తాయనుకోవడం, అవతలి మనిషి ఎవరో కూడా తెలియకుండా గంటల తరబడి ఛాట్‌లు చేయడం, ఓటీపీలు, పాస్ట్‌వర్డ్‌లు ఎవరడిగినా చెప్పేయడం వంటివన్నీ చివరికి ముప్పులుగా తయారవుతాయి. ఇలాంటి ఫేక్ మాటలు, ఫేక్ ఛాట్‌లు బాలికల విషయంలో అనునిత్యం కోకొల్లలుగా జరిగిపోతూనే ఉన్నాయి. తెలిసీ తెలియని పరిజ్ఞా నంతో ఆన్‌లైన్‌లో అలా వ్యవహరిస్తే చాలా ప్రమాదమని చాలా మందికి తెలియడం లేదు. తీరా, జరిగిందేమిటో తెలుసుకునే సరికి, జరగాల్సిన నష్టమంతా జరిగిపోయి ఉంటుంది. మన ఫోటోలని మనచేతనే పోస్ట్ చేయించుకుని, వాటిని మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా తయారుచేసి, మన పరువుల్ని బజారున పెట్టే అసాంఘిక మూకలన్నీ ఒక విష 'వల'యంగా మారి బాలికలను వేధింపులకి గురిచేస్తున్నాయి. బాలికల వ్యక్తిగత వివరాలను వారికి తెలియకుండానే ఆన్‌లైన్‌లో గమనించి, వారిని అసభ్యకరంగా ట్రోల్ చేయడం వంటివి నేటి డిజిటల్ సమాజంలో మితిమీరుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇంటర్‌నెట్ అందుబాటులో ఉన్నప్పటికీ దానిని ఎలా సురక్షితంగా వాడు కోవాలో తెలియకపోవడం వల్ల అధికశాతం మంది బాలికలు సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు కూడా. ఇకనైనా ప్రభుత్వాలు ఇలాంటి వినాశకర ఉపద్రవాలపై దృష్టిపెట్టి సైబర్ మోసగాళ్ల భరతం పట్టాలి. బాలికలు మోసాలకి గురికాకుండా, ప్రభుత్వాలు బాలికలకి డిజిటల్ విద్య నేర్పేముందు, ముందుగా డిజిటల్ అక్షరాస్యతను నేర్పాలి. ప్రాథమికంగా ఏది మంచో ఏది చెడో తప్పనిసరిగా సాంకేతిక ఉపాధ్యాయినులతో వారికి అవగా హన కలిగించాలి. ప్రతిచోటా కౌన్సిలింగ్ సెంటర్లు పెట్టి ఆన్‌లైన్ విజ్ఞానాన్ని అందరికీ పంచాలి. రకరకాల యాప్‌ల పేరుతో ఫోన్‌లలోని వ్యక్తిగత సమాచారాన్ని కూడా దొంగిలిం చేసి, బాలికలను మాయమాటలతో బ్లాక్‌మెయిల్ చేసే ఘరానా మోసగాళ్ళున్న కాలమిది. బాలికలూ.. వారి తల్లి తండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త!

# ఎన్నికల కమిషన్ పై అనుమానాలు , అపోహలు ఆందోళన కలిగిస్తున్నాయి




భారత ప్రధాన ఎన్నికల కమిషన్‌పై గత వారం మన 'లాయర్'లో వచ్చిన మొదటి పేజీ వార్త ఆలోచింపదగిన విధంగా వుంది. భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతే వెన్నెముక. కానీ, ప్రధాన ఎన్ని కల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ పనితీరుపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) విష యంలో తలెత్తిన వివాదాలు, కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అంశాలపై సుప్రీంకోర్టు కూడా వివరణ కోరడం పరి స్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అయితే, ఆరోపణలు నిజమని ముందుగానే నిర్ధా రించడం ఎంత తప్పో, వాటిపై ప్రశ్నలు లేవనెత్తడాన్ని అణచివేయడం కూడా అంతే ప్రమాదకరం. ఎన్నికల కమిషన్ అధికా రంలో ఉన్న పార్టీకి గానీ, ప్రతిపక్షాలకు గానీ అనుకూలంగా కాకుండా రాజ్యాంగా నికి మాత్రమే జవాబుదారీగా ఉండాలి.

ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏదైనా రాజకీయ పార్టీ ప్రయోజనాలకు అనుగు ణంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో బలపడితే.. దాని ప్రభావం ఒక్క ఎన్నికకే పరిమితం కాదు. ఓటరు జాబితాలపై నమ్మకం తగ్గుతుంది, ఎన్నికల ఫలితాలపై సందేహాలు పెరుగుతాయి, ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం దెబ్బతింటుంది. చివ రకు ప్రజల తీర్పుపై కూడా అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే జ్ఞానేష్‌కుమార్‌పై వచ్చిన ప్రతి ఆరోపణకు పారదర్శకమైన వివరణ, వాస్తవాల ఆధా రంగా సమాధానం, అవసరమైతే స్వతంత్ర విచారణ జరగాలి. అదే సమయంలో ఎన్ని కల కమిషన్‌ను రాజకీయ పోరాటానికి వేది కగా మార్చకుండా అన్ని రాజకీయ పక్షాలు బాధ్యతగా వ్యవహరించాలి. ఎన్నికల కమి షన్ ఎవరి చేతిలోని పావుగా కనిపించకూ డదు. అది ప్రజల ఓటుకు కాపలాదారుగా మాత్రమే కనిపించాలి. ఎందుకంటే ఎన్నిక లపై నమ్మకం కోల్పోతే ప్రజాస్వామ్యంపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

**యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.**

# నెల్లూరుకి ప్రత్యేక ఆకర్షణగా ఎస్పీ బాలు స్మారకం

నెల్లూరు అన్నమయ్య సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ప్రముఖ నేపథ్య గాయకుడు, పద్మవిభూషణ్ ఎస్.పీ.బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహం, స్మారకం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బాలు గారి అభిమానులతో పాటు నెల్లూరు నగరాన్ని సందర్శించే ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన ప్రదేశంగా ఈ స్మారకం గుర్తింపు పొంది సంగీతప్రియు లని ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఇక్కడ నిత్యం వినిపిస్తున్న బాలు గారి స్వరం ఆయన అభిమానులకి ఓ వరం అని చెప్పాలి. దేశంలోనే ప్రత్యేకంగా, వినూత్నంగా ఈ స్మారకాన్ని రూపకల్పన చేసి ఆవిష్కరించిన విగ్రహ కమిటీ సభ్యులకు, తమవంతు సహకారం అందించిన దాతలకు ప్రత్యేక అభినందనలు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన స్థానిక శాసనసభ్యునికి, ప్రభుత్వ యంత్రాంగానికి కృతజ్ఞతలు. దాదాపుగా భారతదేశంలోని అన్ని ప్రధాన భాషలలో తన గాత్రాన్ని వినిపించిన బాలు గారి కళా ప్రస్థానాన్ని, ఆయన అపారమైన ప్రజాదరణను చిరస్థాయిగా గుర్తుచేసేలా ఈ స్మారకం రూపుదిద్దుకోవడం నెల్లూరు ప్రజలకు గర్వకారణం. భవిష్యత్ తరాలకు కూడా బాలు గారి సంగీత వార సత్వాన్ని పరిచయం చేసే ఈ స్మారకం మరింత ప్రసిద్ధిచెంది నెల్లూరు నగరానికి ఓ విశిష్ట గుర్తింపుగా నిలవాలని ఆకాంక్షిద్దాం.

**- బి. కాత్యాయని, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు.**

# ఇరవై ఐదేళ్లు: మోడీ రాజకీయ ప్రయాణం

మనసులో మాట 118

ప్రధాని నరేంద్ర మోడీ 2026 అక్టోబరు 7 నాటికి ఒక కీలక మైలురాయికి చేరుకున్నారు. ఒక ప్రభుత్వాధినేతగా ఈ రోజుతో ఆయనకు 25 సంవత్సరాల ప్రయాణం పూర్తయింది. సరిగ్గా పాతికేళ్ల క్రితం.. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ ప్రమాణం చేశారు. అప్పటికి ప్రజలు ఎన్నుకున్న పదవిలో అనుభవమేమీ లేకపోయినా, ఆర్ఎస్ఎస్‌లో దశాబ్దాల సంస్థాగత అనుభవం, బీజేపీలో నిర్వాహకుడిగా పనిచేసిన అనుభవం ఉంది. 25ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూస్తే ఒక అసాధారణమైన రాజకీయ ప్రయాణం, దాని వెనుక ప్రత్యేకమైన పరిపాలనా ముద్ర కనిపిస్తాయి. ఈ 25 ఏళ్లను కేవలం పదవీకాలంతో కొలవడం సరికాదు; ఒక నాయకుడు తనను తాను మలచుకుంటూ దేశ రాజకీయ దిశను ఎలా మార్చాడన్నదానికి ఇది నిదర్శనం.

మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు రాష్ట్ర పరిస్థితి వడ్డించిన విస్తరిలా లేదు. 2001 భూకంపం, తుపాన్లు, కరువులు రాష్ట్రాన్ని దెబ్బ తీశాయి. అవి ఆయన సామర్థ్యానికి పరీక్షగా నిలిచాయి. అక్కడే ఆయన పరిపాలనా శైలి బయటపడింది. ప్రభుత్వ యంత్రాంగం పనితీరును నిరంతరం సమీక్షించడం, లక్ష్యాలను నిర్దేశించడం, ఫలితాలను కొలవడం వంటి పని సంస్కృతికి ప్రాధాన్యం ఇచ్చారు. 'స్వాగత్', 'జ్యోతిగ్రామ్', నీటి నిర్వహణ వంటి కార్యక్రమాలు ఈ పాలనా నమూనాలో భాగమయ్యాయి. గుజరాత్‌లోని ఈ అనుభవాన్నే తర్వాత 'గుజరాత్ మోడల్'గా జాతీయ రాజకీయాల్లోకి తీసుకొచ్చారు.

2014 ఎన్నికలు మోడీ రాజకీయ జీవితంలోనే కాదు, భారత రాజకీయాల్లోనూ కీలక మలుపు. బీజేపీ 282 స్థానాలతో సొంత మెజారిటీ సాధించింది. వ్యక్తిగత నాయకత్వం, అభివృద్ధి, బలమైన ప్రభుత్వం, అవినీతి వ్యతిరేకత, మధ్యతరగతి ఆశలను ఒకే రాజకీయ కథనంగా మలచారు. 'చాయ్‌వాలా' నుంచి ప్రధాని వరకు తన జీవితకథను రాజకీయ కమ్యూనికేషన్‌లో భాగం చేస్తూ, టెక్నాలజీ, సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించారు. బీజేపీని మరింత విస్తృతమైన పాన్-ఇండియా శక్తిగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. 2013లో బీజేపీ ముఖ్యమంత్రులు దేశంలోని ముఖ్యమంత్రుల్లో సుమారు 17శాతం ఉండగా, 2024నాటికి ఆ వాటా దాదాపు 43శాతానికి చేరడం ఈ విస్తరణకు నిదర్శనం. 2024లో బీజేపీకి సొంత మెజారిటీ రాకపోయినా, ఎన్డీయే భాగస్వాములతో కలిసి మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, ఈ ప్రయాణమంతా సులువుగా సాగలేదు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, రైతు చట్టాల విషయంలో తీవ్ర వ్యతిరేకతను మోడీ ఎదుర్కొన్నారు. నోట్ల రద్దుపై ఆర్థిక ప్రభావాలపై విస్తృత చర్చ జరిగింది. రైతు చట్టాలపై దేశవ్యాప్త ఆందోళనలు చివరకు వాటి ఉపసంహరణకు దారితీశాయి. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ ప్రభావం, వలస కార్మికుల సంక్షోభం కూడా ప్రభుత్వానికి తీవ్రమైన పరీక్షలుగా నిలిచాయి. అయినప్పటికీ, అదే కాలంలో 'జన్ ధన్-ఆధార్-మొబైల్', ప్రత్యక్ష నగదు బదిలీ వంటి వ్యవస్థలు సంక్షేమ పంపిణీ స్వరూపాన్ని మార్చాయి. యూపీఐ ద్వారా డిజిటల్ లావాదేవీలు సాధారణ భారతీయుడి రోజువారీ ఆర్థిక జీవితంలో భాగమయ్యాయి. ఆర్థికంగా భారత్ గణనీయంగా ఎదిగి ప్రపంచంలోని ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. అత్యంత పేదరికం కూడా తగ్గింది. అయితే, ఉపాధి నాణ్యత, తలసరి ఆదాయం, అసమానతలు, ప్రైవేట్ పెట్టుబడులు, అధిక ఉత్పాదక ఉద్యోగాల సృష్టి వంటి సవాళ్లు ఇంకా ఉన్నాయి.

విదేశాంగంలోనూ భారత్ పాత్రను విస్తరించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిం చింది. పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్, 2025లో ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భద్రతా విధానంలో కఠిన వైఖరికి సంకేతాలుగా నిలిచాయి. అమెరికా, రష్యా, యూరప్, గల్ఫ్ దేశాలు, జపాన్ వంటి శక్తి కేంద్రాలతో ఏకకాలంలో సంబంధాలు కొనసాగిస్తూ వ్యూహాత్మక స్వేచ్ఛను కాపాడుకోవడం మోడీ విదేశాంగ విధానంలోని ముఖ్యమైన లక్షణంగా కనిపిస్తుంది. G20 అధ్యక్షత సందర్భంగా గ్లోబల్ సౌత్ గొంతుకగా భారత్‌ను ముందుకు తేవడం, ఆఫ్రికన్ యూనియన్‌ను G20లో చేర్చడంలో కీలకపాత్ర పోషించడం కూడా అదే వ్యూహంలో భాగం. అదే సమయంలో మోడీ పాలనపై విమర్శలూ ఉన్నాయి. ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత, అధికార కేంద్రీకరణ, మీడియా స్వేచ్ఛ, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థల వినియోగం వంటి అంశాలపై ప్రతిపక్షాలు, పౌర సమాజ సంస్థలు ప్రశ్నలు లేవనెత్తాయి. ఎన్నికల నిధుల విషయంలో సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేయడం సంస్థాగత నియంత్రణల ప్రాముఖ్యతను మరోసారి ముందుకు తెచ్చింది.

నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రయాణాన్ని కేవలం విజయగాథగానో, విఫలగాథగానో చూడలేం. ఒక నాయకుడు తన వ్యక్తిగత బ్రాండ్‌ను పార్టీ బ్రాండ్‌గా, పార్టీని ప్రభుత్వ బ్రాండ్‌గా, ప్రభుత్వ పథకాలను రాజకీయ కమ్యూనికేషన్‌లో భాగంగా ఎలా మార్చుకోగలడో ఈ కాలం చూపించింది. అయితే ఎప్పటికప్పుడు ఒక నవతరం వస్తూనే ఉంటుంది. కొత్త ఆకాంక్షలను తెరపైకి తీసుకొస్తుంది. వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతుంది. ఈ నేపథ్యంలో మోడీ నిర్మించిన రాజకీయవ్యవస్థ ఆయన వ్యక్తిగత నాయకత్వాన్ని దాటి ఎంతకాలం నిలబడుతుంది? ఆయన నిర్మించిన మౌలిక వసతులు దేశాన్ని ఎంత దూరం తీసుకెళ్తాయి? అనే ప్రశ్నలకు రాబోయే కాలమే సమాధానం చెప్పాలి.



అయితే ఇప్పటివరకు ఒక విషయం మాత్రం స్పష్టం. మోడీ 25 ఏళ్ల ప్రస్థానం భారత రాజకీయాల్లో నాయకత్వం, ఎన్నికల వ్యూహం, పాలనా విధానం, డిజిటల్ సంక్షేమం, విదేశాంగం.. ఈ ఐదు రంగాల్లోనూ తనదైన ముద్ర వేసిన అధ్యాయంగా మారింది. ఇది కచ్చితంగా చరిత్ర గుర్తుంచు కునే ఒక రాజకీయ ప్రయోగం.

**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# పేదల డాక్టర్ ప్రభాకర్‌నాయుడు సేవలు మరువలేం!

## ● ఎమ్మెల్యే సోమిరెడ్డి

కావలి మున్సిపాలిటీ మాజీ చైర్మెన్, పేదల డాక్టర్‌గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ ప్రభాకర్‌నాయుడు మరణించడం బాధాకరమని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కావలిలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మెన్‌గా కావలి ప్రజలకు ప్రభాకర్ నాయుడు అందించిన సేవలను కొనియాడారు. వారి సేవలను మరువలేమన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు మంచి హస్తవాసి గల ప్రజా వైద్యుడిగా ప్రభాకర్ నాయుడు గుర్తింపు పొందారన్నారు. ప్రభాకర్‌నాయుడుతో తమకు చాలా అనుబంధం ఉందని ఆయన వివరించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, సుడా చైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్‌నాయుడు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

### నా కంటి చూపు ఆయన పుణ్యమే - బీద రవిచంద్ర

నా కంటి చూపు ఇప్పుడు బాగా ఉండడం ఆయన పుణ్యమేనని, కావలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేసి రుణం తీర్చుకుంటానని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. డాక్టర్ ప్రభాకర్‌నాయుడు భౌతికకాయానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి ఆయన నివాళులర్పించారు. అనంతరం, రవిచంద్ర మాట్లాడుతూ, 28 ఏళ్ల క్రితం గౌరవరం వద్ద తాను రోడ్డు ప్రమాదానికి గురయ్యానని, డాక్టర్ ప్రభాకర్‌నాయుడు చేసిన ప్రాథమిక చికిత్స కారణంగా తన కంటి చూపు నిలబడిందని, ఇదంతా ఆయన చేతిచలువేనని గుర్తుచేసుకున్నారు. డాక్టర్ ప్రభాకర్ నాయుడు కావలి ప్రాంతంలో పేద ప్రజల ఆపద్బాంధవుడుగా ఉండేవారన్నారు. అర్ధరాత్రి అత్యవసరమై పేదలు తలుపుతట్టినా విసుగు, విరామం లేకుండా 55 ఏళ్ల పాటు నిరంతరం వైద్యసేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. ఎన్టీఆర్ అభిమానిగా, కావలి మున్సిపల్ చైర్మన్‌గా, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షులుగానే కాకుండా టీడీపీలో అనేక పదవులు చేపట్టి సేవలు అందించారని తెలిపారు. కావలి ప్రజలకు ప్రభాకర్‌నాయుడు చిరస్థాయిగా గుర్తుండిపోయేలా అందరి సహకారంతో పట్టణంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని బీద తెలిపారు.

# విపిఆర్ చొరవతో..
# 'సాగరమిత్ర'లకు ఊరట

## ● మరో 3 నెలలు పొడిగింపునకు కేంద్రం అనుమతి



'సాగరమిత్ర'ల సేవలకు మరో మూడు నెలల పొడిగింపు లభించింది. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సాగరమిత్రల సేవలను మరో మూడు నెలల పాటు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఈ ఏడాది డిసెంబరు 31వతేదీ వరకు సాగరమిత్రలు తమ సేవలను కొనసాగించనున్నారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో 350 మంది, నెల్లూరుజిల్లాలో 46మంది సాగరమిత్రలకు ప్రయోజనం చేకూరనుందని ఈ సందర్భంగా విపిఆర్ చెప్పారు. సాగరమిత్రల సేవల వ్యవధిని గతంలో పొడిగించిన కాలం కూడా ముగియనున్న సమయంలో వారు తమ సమస్యను ఎంపీ వీపీఆర్‌కి తెలిపారు. వారి అభ్యర్థనపై స్పందించి ఈ సమస్యను విపిఆర్ కేంద్ర మత్స్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగరమిత్రల సేవల కొనసాగింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్రం స్పందించి ఆమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విపిఆర్ తెలియజేశారు.

# యువత ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

## 'ధీరనారి యువతీ సమ్మేళనం'లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





చదువులో మార్కులు తగ్గాయని క్షణికావేశంలో నిరాశకు లోనై తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని విద్యార్థినులకు కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుందని, కష్టాలు ఎదురైనప్పుడు వాటిని ఒంటరిగా భరించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులతో పంచుకోవాలని చెప్పారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో మంగళవారం నిర్వహించిన 'ధీరనారి యువతీ సమ్మేళనం'లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. మార్కులు తగ్గినంత మాత్రాన జీవితంలో ఏమీ కోల్పోయినట్లు భావించి నిరాశ చెందాల్సిన పనిలేదని అన్నారు. జీవితం వేరు.. జీవనం వేరు అని చెబుతూ, భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. తమ పిల్లలను కష్టపడి పెంచుతూ తల్లిదండ్రులు ఎన్నో కలలు కంటారని, వారి ఆశలను ఎప్పుడూ వమ్ము చేయకూడదని విద్యార్థినులను కోరారు. ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం ఇంటి నుంచే, ముఖ్యంగా తల్లి నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ఉద్యోగం, ఉన్నత స్థానం సాధించడంతో పాటు కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దడం కూడా మహిళ జీవితంలో ముఖ్యమైన విజయమేనని చెప్పారు. 'ఓడిపోతాం' అనే ఆలోచనకు చోటివ్వకుండా, 'ఇది కాకపోతే ఇంకొకటి' అనే సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. ఇటీవల పలు కళాశాలల్లో విద్యార్థులతో మాట్లాడినప్పుడు వారి ఆలోచనా విధానం, తమ భవిష్యత్తుపై ఉన్న స్పష్టత తనను ఎంతో ఆకట్టుకున్నాయని ఆమె చెప్పారు. చిన్న వయసులోనే సమాజం కోసం ఆలోచిస్తూ ప్రజాసేవ పట్ల ఆసక్తి చూపుతున్న నేటి జెన్‌జీ యువతను అభినందిస్తున్నానన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో.. భారీ మెజారిటీ సాధించాలి

## ➤ నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



కూటమి నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలతో బిజెపి, జనసేన నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 36 డివిజన్లలో కూటమి అభ్యర్థులు భారీస్థాయిలో మెజారిటీ సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. 36కి 36 స్థానాలనూ గెలుచుకునేందుకు కృషిచేయాలన్నారు. నెల్లూరు రూరల్‌లో మేయర్ అభ్యర్థికి భారీ మెజారిటీ తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు మండ్ల ఈశ్వరయ్య, యరబోలు రాజేష్, జనసేన ప్రతినిధులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నూనె మల్లికార్జునయాదవ్, చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# గాంధీ ఆశ్రమాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

## ● కలెక్టర్ హిమాన్షు శుక్ల

అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్ల సందర్శించి, గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమంలోని గాంధీజీ ఛాయా చిత్ర ప్రదర్శనశాలను తిలకించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి చారిత్రక ప్రాధాన్యత ఉందని, ఆశ్రమ అభివృద్ధి, నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆశ్రమంలోని మ్యూజియాన్ని మరింత అభివృద్ధి చేసి, గాంధీజీ జీవితం, సిద్ధాంతాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్రను భావితరాలకు పరిచయం చేసేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ...1921లో మహాత్మా గాంధీజీ స్వయంగా ఇక్కడ ప్రారంభించిన పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం ఎంతో చరిత్ర కలిగిందని, ఎందరో దేశసేవకులకు ఈ ఆశ్రమం స్ఫూర్తినిచ్చిందని, నెల్లూరు జిల్లాకు చెందిన వందలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా వారి పేర్లను శిలాఫలకాలపై చెక్కడం ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను గుర్తుచేస్తుందన్నారు. తొలుత, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, ఆశ్రమ కమిటీ నిర్వాహకులు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

# చెత్తకాగితాలు ఏరుకునే నిరుపేదకు.. ప్రభుత్వం అండ



చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద కుటుంబం కష్టాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించడంతో జిల్లా యంత్రాంగం ఆ కుటుంబానికి అండగా నిలిచింది. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆ కుటుంబానికి అవసరమైన సహాయం అందించేలా చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆ కుటుంబానికి ఇంటి నివేశ స్థలం ధృవీకరణ పట్టాను తహసీల్దార్ అందజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హత మేరకు ఇంటి నివేశ స్థలం పట్టా మంజూరు చేయడంతో కుటుంబానికి శాశ్వత నివాసం ఏర్పాటైంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమకు ఇంటి నివేశ స్థలం పట్టా మంజూరు చేయడం పట్ల ఆ పేద కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదరికం కారణంగా వారి పిల్లలు విద్యకు, వైద్య సదుపాయాలకు దూరం కాకుండా జిల్లా యంత్రాంగం వారికి ప్రభుత్వ సహాయం అందిస్తోంది. మంత్రి నారా లోకేష్ స్పందనతో, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చర్యలతో ఆ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం భరోసాగా నిలిచింది.

# నెల్లూరు కబుర్లు

## వీఆర్‌సీ గ్రౌండ్‌కి కొత్త కళ


అభివృద్ధి పనులకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ, షరణి

నెల్లూరు నగర నడి బొడ్డున ఉన్న వీఆర్‌సీ గ్రౌండ్‌కు కొత్త హంగులు దిద్దేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టారు. విద్యార్థులు, వాకర్స్, క్రీడాకారులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్ల నిర్మాణ పనులకు తన కుమార్తె షరణితో కలిసి ఈనెల 6న శంకుస్థాపన చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టును కూడా ఆధునీకరిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థలం అందుబాటులో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలోనూ స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వీఆర్‌సీ గ్రౌండ్‌లో జెండా పోల్ ఏర్పాటుకు రూ.20వేల విరాళం అందించిన డాక్టర్ పోకల రవిని మంత్రి నారాయణ అభినందించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాన్ని ఆయనకు అందజేశారు.

## రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం


తలసేమియా చిన్నారులతో మండలి బుద్ధప్రసాద్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నెల్లూరు జిల్లా శాఖను ఇటీవల అవనిగడ్డ శాసనసభ్యులు, మాజీ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ సేవా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం తలసేమియా వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను పలకరించి, వారితో కొంతసేపు గడిపారు. చిన్నారులకు రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న నిరంతర సేవలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో అవసరమైన వారికి రక్తం అందించడంతో పాటు, తలసీమియా వంటి దీర్ఘకాలిక వైద్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు నిరంతరం సేవలు అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ అడ్‌హాక్ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాలమూరి రంగారావు, చమర్తి జనార్ధన్‌రాజు, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ యస్.వరప్రసాద్, సెక్రెటరీ పి.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళా ప్రాంగణంలో.. ఉచిత శిక్షణ

నెల్లూరు గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో మహిళలకు హ్యాండ్ ఎంబ్రాయిడరీ, పిల్లలు-వృద్ధుల సంరక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం మేనేజర్ కె. మాధవి ఈనెల 6న ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉన్నవారు అర్హులని, ఆసక్తి కలవారు తమ మార్కుల లిస్టు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు జెరాక్స్‌తో మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని, వివరాలకు 83339 21347 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

### బుజబుజనెల్లూరులో కార్డెన్‌సెర్చ్

నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుజబుజ నెల్లూరు, భగత్‌సింగ్ కాలనీలో మంగళవారం నాడు పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇన్స్‌పెక్టర్ సిహెచ్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇళ్లను తనిఖీచేసి, వాహనపత్రాలు సక్రమంగా లేని 13 బైక్‌లు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. నేరనియంత్రణ, శక్తియాప్, సైబర్ నేరాలు తదితర అంశాలపై స్థానికులకు పోలీసులు అవగాహన కలిగించారు. ఎస్‌ఐలు ప్రసాద్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైద్యఉద్యోగుల ఆందోళన

తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలవద్ద కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. నల్లరిబ్బన్లు ధరించి నిరసన దీక్షలో పాల్గొన్నారు. జేవీసీ ఛైర్మెన్ శరత్‌బాబు, రాష్ట్ర నాయకులురూత్‌గ్రేస్, ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం నాయకుడు గోపీకృష్ణ తదితరులు మాట్లాడుతూ, తమ సమస్యలను తీర్చాలని నెలరోజుల నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమను రెగ్యులర్ చేసేవరకు నూరుశాతం గ్రాస్ వేతనం ఇవ్వాలని కోరారు. ఎం.డీ షఫీ, రత్న, లీలాకుమార్, రవిరాజ, శ్రీలత, వీరనారయణ పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఏర్పాట్లపై.. కోటంరెడ్డి సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన గిరిధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో జరుగనున్న శరన్నవరాత్రి వేడుకల నిర్వహణల ఏర్పాట్లపై ఈనెల 3న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓతో కలసి ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో నెల్లూరు నగరం నుంచే కాక, చుట్టుపక్కల అనేక ప్రాంతాల నుంచి భక్తజనం నిత్యం వేల సంఖ్యలో తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆలయ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, భక్తుల భద్రతకు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని నగరపాలక సంస్థ అధికారులకు తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వీఐపీలకు, దాతలకు ప్రతిరోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.20 వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు దర్శన సమయం కేటాయించాలన్నారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఛైర్మెన్ ఏలూరు శిరీష, ఆలయ ఇఓ శ్రీధర్‌నాయుడు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 11 నుంచి నవరాత్రి ఉత్సవాలు :

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 11 నుంచి 52వ శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 11వతేదీ ఆదివారం శ్రీ చండీ అలంకారం, 12న శ్రీ భవాని, 13న గాయత్రి, 14న శ్రీ అన్నపూర్ణ, 15న శ్రీ గజలక్ష్మి, 16న శ్రీ సరస్వతి, 17న శ్రీ కాళిక, 18న శ్రీ దుర్గ, 19న శ్రీ మహిషాసురమర్దిని, 20న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాలు నిర్వహిస్తారు. అదేరోజు (20న) రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి నగరోత్సవం ప్రారంభమవుతుంది.

## 79 మందికి..స్వచ్ఛాంధ్ర అవార్డులు



స్వచ్ఛ అవార్డులను ప్రదానం చేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసిన స్వచ్ఛాంధ్ర అవార్డులలో భాగంగా, జిల్లాలో ఎంపికైన 79మంది అవార్డు గ్రహీతలకు ఈనెల 5న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతులమీదుగా అవార్డులను బహుకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహాన్ని, సరికొత్త స్ఫూర్తిని నింపుతాయని, ఇదే స్ఫూర్తితో స్వచ్ఛమైన నెల్లూరు సాధనకు ప్రతి ఒక్కరూ మరింత అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. జిల్లాను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. డీఆర్‌ఓ జయకుమార్, నగర కమిషనర్ నందన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకట్రామన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### 'విశ్వబ్రాహ్మణ నిధి'కింద.. 35మందికి స్కాలర్‌షిప్‌లు

నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నా చారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి కింద 2026-27 విద్యా సంవత్సరానికి 35మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేశారు. ఈనెల 4న నెల్లూరులోని పుత్తేటి దయానంద నివాసంలో, చక్రపాణి అధ్యక్షతన విద్యానిధి సమావేశం జరిగింది. అందులో బీటెక్ చదువుతున్నవారికి 3వేలా 500 రూపాయలు, గ్రాడ్యుయేట్‌లకు 3వేలు, ఇంటర్-డిప్లొమా ఇంజనీరింగ్ వారికి 2వేలా 500 వంతున మొత్తం 71వేల రూపాయలను స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్లు వారు తెలిపారు. దాతల సహకారంతో స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. టి.చక్రపాణి, టి.సురేష్, ఎం.చెంచురత్నం, శ్రీనివాసాచారి, కె.శేఖర్‌రెడ్డి, నారాయణరావు, ఆలూరు కరుణాకర్, ఎం.పెంచలనరసింహాచారి పాల్గొన్నట్లు కార్యదర్శి పి.దయానంద తెలిపారు.

### యువజనోత్సవాలు

యువజన సంక్షేమశాఖ-సెట్నెల్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని డీకేడబ్ల్యు కళాశాలలో ఈనెల 6న జిల్లాస్థాయి యువజనోత్సవాలు జరిగాయి. విఎస్‌యు వైస్‌చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందరూ కలసికట్టుగా ఉండి దేశ ప్రగతిని సాధించి వికసిత్ భారత్ లక్ష్యసాధనకు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సెట్నెల్ సీఇఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ, యువత స్వామీ వివేకానంద ఆశయాల బాటలో నడవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ గిరి, ఎం.రమణారెడ్డి, ఆర్‌అండ్‌డీ డిప్యూటీ ఎస్ఇ రామకృష్ణ, కొడవలూరు ఎంపీడీఓ సుబ్బారావు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని యువజనోత్సవాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

## కవితల పోటీలు

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 17వ వార్షికోత్సవం సందర్భంగా కవితలు, నానీల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏదైనా సామాజిక అంశంపై కవులకు కవితలు, నానీల పోటీలు జరుగుతాయని, విద్యార్థుల విభాగంలో పోటీల్లో పాల్గొనేవారు ఏదైనా ఒక సామాజిక అంశానికి సంబంధించి కవిత రాయవచ్చని తెలిపారు. కవితల పోటీల్లో పాల్గొనేవారు నానీల పోటీల్లో పాల్గొనరాదనే నిబంధన పెట్టారు. కవితలు 25లైన్లకు మించరాదని, నానీలు 5 మాత్రమే పంపాలని, ఈనెల10వతేదీలోగా వాట్సాప్ 8500130770 లేదా 94404 65797 నంబర్లకు పంపించాలని వారు సూచించారు.

## రాజరాజేశ్వరమ్మ దేవస్థానంలో.. వానల కోసం ప్రత్యేక పూజలు



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 6న వైభవంగా వరుణ యాగం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డపనేని రాజానాయుడు, కో క్లస్టర్ ఇంచార్జ్ మమతారెడ్డి, జిల్లా దేవదాయశాఖ అధికారి శ్రీ కోవూరు జనార్దన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్ నాయుడు, దేవస్థానం ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, 28వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చెక్కా సాయి సునీల్, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీధర్‌రెడ్డి అనుకున్నది సాధించాడు!

# 50 ఏళ్ల సమస్యకి పరిష్కారం!

### • ఎట్టకేలకి పొట్టేపాళెం వంతెన ప్రారంభం



ఎట్టకేలకి శ్రీధర్‌రెడ్డి అనుకున్నది సాధించాడు. ప్రజలు ఎప్పటినుంచో కోరుకుంటున్న పొట్టేపాళెం వంతెనని సాకారం చేశాడు. ఇటీవలే నిర్మాణం పూర్తయింది. ఈ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, 'బ్రిడ్జి లేనప్పుడు, ఈ దారిన పోతున్న ప్రజల బాధను నేను కళ్లారా చూశాను. ఇక్కడ బ్రిడ్డి నిర్మాణాన్ని సంవత్సరంలో పూర్తిచేస్తామని చెప్పి, 11నెలల్లోనే పూర్తిచేసి చూపించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందనీయులని' కలెక్టర్ ప్రశంసించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు ఈవంతెన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, నెల్లూరుజిల్లా చరిత్రలో పొట్టేపాళెం బ్రిడ్జి నిలచిపోతుందన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో కోట్లాదిరూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని, ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ ఎంతగానో సహకరిస్తున్నారని కొనియాడారు. గత 12ఏళ్ళుగా నెల్లూరురూరల్ ఎమ్మెల్యేగా ఉన్నా, గత పదేళ్లలో లేని సంతృప్తి ఈ రెండేళ్లలో కలిగిందన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి అని, నెల్లూరు రూరల్‌లో జరిగిన, జరుగుతున్న, టెండర్లు పిలిచిన, అభివృద్ధి పనుల విలువ 966కోట్ల రూపాయలని, ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ధన్యవాదాలన్నారు. స్థానిక ప్రముఖులు సుబ్బారెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్ళకు..మంచిరోజులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ హాస్టళ్లకు మంచి రోజులు వచ్చాయని జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. ఈనెల 6న నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలలో, గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందేలా డైట్ ఛార్జీలు పెంచారని, దీనివల్ల రాష్ట్రంలోని 3783 హాస్టళ్ళలో 6.5 లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

# వానల్లు కురవాలి వానదేవుడా!

### • వరుణయాగంలో పాల్గొన్న మంత్రి నారాయణ



పూజలు నిర్వహిస్తున్న మంత్రి నారాయణ, ఆయన కుమార్తె షరణి

ఎల్‌నినో ప్రభావంతో వాన కురవక అనేక ప్రాంతాలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వరుణ యాగాలు నిర్వహించాలని సూచించారు. దీంతో జిల్లాలోని అనేక దేవాలయాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు వరుణయాగం నిర్వహించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరు, మూలాపేటలో ఉన్న శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణయాగంలో తన కుమార్తె షరణితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి జలాశయాలు నిండాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆ భగవంతుడిని కోరుకుంటూ ప్రత్యేకపూజలు, హోమ కార్యక్రమాలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉందన్నారు. మన రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఉత్తరాంధ్రలో పరిస్థితి కొంత మెరుగు పడిందని తెలిపారు. అయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన అవసరం ఉందన్నారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జనార్దన్, ఈవో జానకి, ఆలయ ఛైర్మన్ వేలూరు పెంచలరాజు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, గండవరం నాని, అన్నంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన..టీవీఎస్ ఛైర్మెన్



సన్నారెడ్డికి తన పుస్తక ప్రతిని అందజేస్తున్న శ్రీనివాసన్

టీవీఎస్ ఆల్టర్నేటివ్స్ ఛైర్మన్, ఫెడరల్ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈఓ శ్యామ్ శ్రీనివాసన్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీలోని అభివృద్ధిని ఆయనకు వివరించారు. అనంతరం శ్యామ్ శ్రీనివాసన్ శ్రీసిటీ పరిసరాలను సందర్శించి, సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం క్రియ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, "శ్యామ్ శ్రీనివాసన్‌ను శ్రీసిటీకి స్వాగతించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన నాకు కళాశాల సహచరుడు, మంచి మిత్రుడు. వ్యాపారసంస్థలు, వ్యవస్థలు, ప్రజలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన యువతకు ఎంతో విలువైన మార్గదర్శకత్వాన్ని అందిస్తాయని తెలిపారు. శ్యామ్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, శ్రీసిటీని సందర్శించడం, క్రియ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో సమయం గడపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పరిశ్రమ, ఆవిష్కరణ, విద్య అద్భుత సమ్మేళనంగా శ్రీసిటీ కనిపిస్తోందని కితాబిచ్చారు.




# ప్రేరణ కదిలిస్తుంది..క్రమశిక్షణ నిలబెడుతుంది - విజయాన్ని నిర్మించే ద్వంద్వ శక్తులు

మనిషి జీవితంలో విజయాన్ని నిర్మించే రెండు శక్తులు ఉన్నాయి. ప్రేరణ (Motivation) మరియు క్రమశిక్షణ (Discipline). ఇవి రెండూ మన ప్రయాణంలో కీలకపాత్ర పోషిస్తాయి. కానీ వాటి స్వభావం, ప్రభావం, నిలకడ..ఇవన్నీ భిన్నం. ప్రేరణ మనసును కదిలిస్తుంది, మనలో ఉత్సాహాన్ని రగిలిస్తుంది, మన ప్రయాణానికి ఆరంభం ఇస్తుంది. క్రమశిక్షణ మన ప్రయాణాన్ని నిలబెడుతుంది, మన లక్ష్యాన్ని చేరుకునే వరకు మనను నడిపిస్తుంది. ఈ రెండు శక్తులు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే మనం విజయాన్ని నిర్మించగలం. ప్రేరణ అనేది మనసులో ఒక్కసారిగా వెలిగే వెలుగు. ఒక మంచి ప్రసంగం వింటే, ఒక గొప్ప కథ చదివితే, ఒక ప్రేరణాత్మక వీడియో చూస్తే..మనసులో ఉత్సాహం రగిలిపోతుంది. ఆ క్షణంలో మనం ఏదైనా సాధించగలమనే భావన వస్తుంది. కానీ, ఆ వెలుగు ఎక్కువసేపు నిలవదు. ప్రేరణ తాత్కాలికం. అది మన ప్రయాణానికి ఆరంభం ఇస్తుంది, కానీ ప్రయాణాన్ని పూర్తిచేయడానికి అది సరిపోదు. "ప్రేరణ ప్రారంభం, క్రమశిక్షణ ప్రయాణం" అనే మాటలో ఉన్న సత్యం యువత గ్రహించాలి.

క్రమశిక్షణ అనేది మనసులో నిశ్శబ్దంగా వెలిగే దీపం. అది ఒక్కసారిగా రగిలిపోదు; అది నెమ్మదిగా వెలుగుతుంది. కానీ, ఒకసారి వెలిగితే, అది మన ప్రయాణాన్ని చివరి వరకు నడిపిస్తుంది. క్రమశిక్షణ అనేది ప్రతిరోజూ చేయాల్సిన పనిని, మనసు లేకపోయినా, అలసిపోయినా, ఆసక్తి తగ్గినా కూడా చేయగలిగే శక్తి. ఒక విద్యార్థి ప్రతిరోజూ ఒక గంట చదవడం..ఇది ప్రేరణతో కాదు, క్రమశిక్షణతో జరుగుతుంది. ఒక యువకుడు ప్రతిరోజూ ఉదయం నడకకు వెళ్లడం.. ఇది ఉత్సాహంతో కాదు, క్రమశిక్షణతో జరుగుతుంది. ప్రేరణ మనసును కదిలిస్తుంది. క్రమశిక్షణ మనసును నడిపిస్తుంది. ప్రేరణ మనలో ఉత్సాహాన్ని రగిలిస్తుంది. క్రమశిక్షణ ఆ ఉత్సాహాన్ని నిలబెడుతుంది. ప్రేరణ మనకు దిశ చూపిస్తుంది. క్రమశిక్షణ ఆ దిశలో నడిపిస్తుంది. ఈ రెండు శక్తులు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే మనం లక్ష్యాన్ని చేరుకోగలం.

ఇక్కడొక చిన్న కథను గుర్తు చేసుకోవాలి. ఒక యువకుడు తన జీవితంలో పెద్ద లక్ష్యం పెట్టుకున్నాడు. ఒక పోటీపరీక్షలో ఉత్తీర్ణత. మొదట అతను ఎంతో ఉత్సాహంతో చదవడం ప్రారంభించాడు. రోజుకు ఐదుగంటలు చదివాడు. కానీ రెండు వారాల తర్వాత ఉత్సాహం తగ్గిపోయింది. చదవడం ఆపేశాడు. ఆ ప్రేరణ తాత్కాలికం. కానీ ఒకరోజు అతని గురువు ఒకమాట చెప్పాడు: 'ప్రేరణ నీకు ఆరంభం ఇస్తుంది, కానీ క్రమశిక్షణ నీకు విజయాన్ని ఇస్తుంది'.. ఈ మాట అతని మనసును మార్చింది. ప్రతిరోజూ రెండు గంటలు చదవడం ప్రారంభించాడు. ఉత్సాహం ఉన్నా, లేకున్నా ఆ క్రమశిక్షణ ప్రయాణాన్ని నిలబెట్టింది.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

చివరికి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. అప్పుడు గ్రహించాడు..విజయం అనేది క్రమశిక్షణకు ఇచ్చేప్రతిఫలం అని.

ప్రేరణ మనలో భావోద్వేగాన్ని రగిలిస్తుంది. క్రమశిక్షణ మనలో బాధ్యతను పెంచుతుంది. ఒక యువతి తన ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని నిర్ణయించుకుంటే, మొదట ఆమెకు ఎంతో ఉత్సాహం ఉంటుంది. కానీ ఆ ఉత్సాహం కొన్ని రోజుల్లో తగ్గిపోతుంది. కానీ ఆమె క్రమశిక్షణతో ప్రతిరోజూ నడకకు వెళ్లితే, ఆమె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రేరణ ఆమెను కదిలించింది. క్రమశిక్షణ ఆమెను నిలబెట్టింది. ప్రేరణ మనకు లక్ష్యాన్ని చూపిస్తుంది. క్రమశిక్షణ మనకు మార్గాన్ని చూపిస్తుంది. ఒక యువకుడు తన స్టార్టప్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకుంటే, మొదట అతనికి ఎంతో ఉత్సాహం ఉంటుంది. కానీ వ్యాపారంలో సమస్యలు వచ్చినప్పుడు ఆ ఉత్సాహం తగ్గిపోతుంది. కానీ అతనికి క్రమశిక్షణ ఉంటే, అతను ప్రతిరోజూ చిన్నచిన్న పనులు చేస్తూ ముందుకు సాగుతాడు. ఆ క్రమశిక్షణ అతని వ్యాపారాన్ని నిలబెడుతుంది.

ప్రేరణ మనసులో వెలిగే జ్వాల. క్రమశిక్షణ మనసులో నిలిచే దీపం. జ్వాల వేగంగా రగిలిపోతుంది, కానీ త్వరగా ఆరిపోతుంది. దీపం నెమ్మదిగా వెలుగుతుంది, కానీ ఎక్కువసేపు నిలుస్తుంది. విజయాన్ని నిర్మించడానికి మనకు జ్వాల కూడా కావాలి, దీపం కూడా కావాలి. ప్రేరణ మనకు "ఎందుకు" అనే ప్రశ్నకు సమాధానం ఇస్తుంది. క్రమశిక్షణ మనకు "ఎలా" అనే ప్రశ్నకు సమాధానం ఇస్తుంది. ఒక విద్యార్థి ప్రతిరోజూ చదవడం ప్రారంభించడానికి ప్రేరణ అవసరం. కానీ, ఆ చదువును కొనసాగించడానికి క్రమశిక్షణ అవసరం. ఒక యువకుడు ప్రతిరోజూ వ్యాయామం ప్రారంభించడానికి ప్రేరణ అవసరం. కానీ, ఆ వ్యాయామాన్ని కొనసాగించడానికి క్రమశిక్షణ అవసరం. చివరగా, విజయాన్ని నిర్మించడానికి ప్రేరణ మరియు క్రమశిక్షణ రెండూ అవసరం. ప్రేరణ మనసును కదిలిస్తుంది. క్రమశిక్షణ మనసును నిలబెడుతుంది. ప్రేరణ మనకు దిశ చూపిస్తుంది. క్రమశిక్షణ మనకు మార్గం చూపిస్తుంది. ఈ రెండు శక్తులు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే మనం విజయాన్ని నిర్మించగలం. విజయం అనేది ఒక్కరోజులో రాదు. అది ప్రతిరోజూ చేసే చిన్న చిన్న కృషిఫలితం. వాటికి ఆరంభం ప్రేరణ. ఆ కృషికి నిలకడ క్రమశిక్షణ. యువత ఈ రెండు శక్తులను అర్థం చేసుకుని, వాటిని తమ జీవితంలో అమలు చేస్తే, వారి ప్రయాణం వెలుగుతో నిండిపోతుంది. ప్రేరణ మనలో జ్వాలను రగిలిస్తే, క్రమశిక్షణ ఆ జ్వాలను విజయంగా మార్చే అగ్నికుండలా నిలబెడుతుంది.

**వచ్చే వారం :** ఆరోగ్యకరమైన స్నేహాలు : మనసును కాపాడే సరిహద్దుల శక్తి



E-mail: reddyu@gmail.com

---

• శ్రీసిటీలో ప్రమాద ఘటన

# 'టీఐఎల్' లో బాయిలర్ పేలి.. ఐదుగురు మృతి

> బాధిత కుటుంబాలకు 50 లక్షల వంతున పరిహారం
> మానవతా హృదయంతో ఆదుకున్న కలెక్టర్, శ్రీసిటీ ఎం.డి



బాధిత కుటుంబీకులకి పరిహారం వివరాల పత్రాల పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీసిటీలోని టీఐఎల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో ఈనెల 3న విషాదకర సంఘటన చోటుచేసుకుంది. హఠాత్తుగా బాయిలర్ పేలడంతో అక్కడున్న అయిదుగురు కార్మికులు మృతి చెందారు. ప్రమాద ఘటన విషయం తెలిసిన వెంటనే శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఎంతో బాధను వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తదితర అధికారులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. శ్రీసిటీ 18 ఏళ్ల ప్రస్థానంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇదే తొలిసారి అని ఆయన ఆవేదన చెందారు. కేవలం ఆర్థిక పరిహారం అందజేయడంతో సరిపెట్టుకోకుండా, వారి కుటుంబసభ్యుల భవిష్యత్తుకి అండగా నిలబడడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలలో పిల్లలకు విద్య, అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో పాటు అన్ని విధాలా వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ ఆడిట్ కూడా చేపట్టి శ్రీసిటీ పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## అన్ని విధాలా సాయం

**- కలెక్టర్ వెంకటేశ్వర్**

ఈ నెల 5వ తేదీన శ్రీసిటీలోని టిల్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రమాద ఘటన మృతుల కుటుంబీకులతో జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, టిల్ హెల్త్ కేర్ ప్రెసిడెంట్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కపిల్ రూవెర్ సమక్షంలో ఆయన బాధిత కుటుంబీకులను పరామర్శించడంతో పాటు, వారికి అందించనున్న ఆర్థిక పరిహారం, ఇతర సహాయ సహకారాలను వివరించారు. వారికి బీమా, విద్య, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. బాధితులకు సహకారం అందించడంలో టిల్ హెల్త్ కేర్ మరియు శ్రీసిటీ యాజమాన్యం చూపిన చొరవను కలెక్టర్ ప్రశంసించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. మృతుల అంత్యక్రియలు, బాధితుల వైద్య ఖర్చులను కూడా ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఈ దుర్ఘటనలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరబ్ రాయ్, చిన్న మస్తాన్ (చెరివి, సత్యవేడు మండలం), వాసు (తడ), రమేష్ (మాదరపాక్కం), మోహన్ (నాయుడుపేట) మృతి చెందారు. ఇందులో నలుగురు ప్రమాద స్థలంలోనే మృతిచెందగా, వాసు తీవ్ర గాయాలతో చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుల కుటుంబాలను ఆదుకుంటూ వారు నష్టపరిహారం ప్రకటించారు. ఈ ఘటనకి సంబంధించి మృతుల కుటుంబాలకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో కలిపి తన్నీరు వాసు కుటుంబానికి రూ. 78,56,278, కె.చిన్నమస్తాన్ కుటుంబానికి రూ. 72,72,234, గౌరబ్‌రాయ్ కుటుంబానికి రూ. 76,98,345, రమేష్ నటరాజ్ కుటుంబానికి రూ. 61,50,178, మోహన్‌రాజ్ కుటుంబానికి రూ. 65,25,235 పరిహారంగా అందిచనున్నట్లు సమాచారం. ఆమేరకు పరిహార వివరాల పత్రాలను బాధిత కుటుంబసభ్యులకి కలెక్టర్, శ్రీసిటీ ఎం.డి, టిఐఎల్ పరిశ్రమ డైరెక్టర్లు అందజేశారు.

## మాట నిలబెట్టుకున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఇచ్చిన హామీ మేరకు పరిహారపు నగదును టిల్ బాధిత కుటుంబాల వారి బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమ చేశారు. ఈ నగదును తమ కుటుంబాలు, పిల్లల ఉన్నతికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

---

# కలెక్టరేట్‌లో గాంధీ జయంతి

అక్టోబరు 2న నెల్లూరు కలెక్టరేట్‌లో గాంధీజయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జేసీ మొగిలి వెంకటేశ్వర్లు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని ఆయన కోరారు. సత్యం, అహింస, శాంతి, సేవ వంటి గాంధీజీ ఆదర్శాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో పయనిస్తూ విధుల నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీఆర్ఓ విజయ్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు



## ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

అక్టోబరు 2 గాంధీ జయంతి మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా నెల్లూరులోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బందారిపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ మహనీయుల చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, బందారుపల్లి మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీ నిబద్ధతతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎన్.ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.పెంచలయ్య, ఉపాధ్యక్షులు కే.రాజేంద్రప్రసాద్, పి.సతీష్‌బాబు, టి.మల్లికార్జున్‌రావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్ వీరబ్రహ్మేశ్వరరావు, ఎన్.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు

## వీఆర్‌సి వాకర్స్ ఆధ్వర్యంలో...



గాంధీ జయంతి సందర్భంగా ఈనెల 2న నెల్లూరులోని వీఆర్‌సీ గ్రౌండ్‌లో వీఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నళిని మోహన్, అమ్మ ఫర్నిచర్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, డాక్టర్ సిహెచ్ భాస్కర్‌రావు, డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, నన్నేసాహెబ్, లాఫింగ్‌క్లబ్ అధ్యక్షులు బందారు సుబ్బారెడ్డి, సెక్రటరీ సయ్యద్ రియాజ్, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొని, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## సివిల్ పరీక్షలకు..
# దరఖాస్తులకు ఆహ్వానం

యు.పి.యస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ మరియు మెయిన్స్ పరీక్షలకు అర్హత గల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగలు మరియు ముస్లిం మైనారిటీ (బి.సి-ఇ) కులానికి చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారత అధికారి మరియు సంచాలకురాలు పి.వెంకటలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా బి.సి స్టడీసర్కిల్, నెల్లూరు కార్యాలయము నందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఈ నెల 27వ తేదిన రాష్ట్రవ్యాప్తంగా ఆయా సెంటర్లలో సివిల్ సర్వీసెస్ సిలబస్ ఆధారంగా ఆబ్జెక్టివ్ బిట్ టైపులో స్క్రీనింగ్ పరీక్ష ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలో మెరిట్ మరియు రిజర్వేషన్ ప్రాతిపదిక పై 100 మంది అభ్యర్థులను ఎంపికచేసి, వారికి బి.సి.భవన్, గొల్లపూడి-విజయవాడలోని శిక్షణా కేంద్రం ద్వారా ఉచిత శిక్షణతో పాటు స్టడీ మేటీరియల్ మరియు భోజన వసతి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటతో పాటు 10వ తరగతి మరియు డిగ్రీ మార్కుల లిస్టులు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లి దండ్రుల వార్షిక ఆదాయము రూ. 1,00,000/- లోపు మాత్రమే), ఆధార్ మరియు బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్ 2 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు జత పరచి అభ్యర్థులు ఈనెల 20 తేదిలోగా ఆర్.టి.సి బస్టాండ్ ప్రక్కనగల శోదన్‌నగర్‌లోని పాత 'మీ-సేవ కేంద్రం'లోని బి.సి. స్టడీ సర్కిల్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9381554779 లేదా 8019375443లలో సంప్రదించాలని ఆమె కోరారు.

# ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి
## జిల్లా ప్రధాన న్యాయమూర్తి



అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని వెంకటాచలం మండల పరిధిలోని చెముదుగుంటలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవ వేడుకలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అక్కిరెడ్డి నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. శ్రీనివాస్, ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కారాగారంలోని వివిధ విభాగాలను, ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తుల కేంద్రాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరూ పుట్టుకతోనే నేరస్థులు కారని, వ్యక్తుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ఎదురైన పరిస్థితులు వారి జీవితాలపై ప్రభావం చూపుతాయని అన్నారు. నేరానికి దారితీసిన పరిస్థితులను అర్థం చేసుకుని, ఖైదీలలో సానుకూల మార్పు తీసుకురావాలని సూచించారు. కారాగారంలో ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో పరిశ్రమలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఖైదీలకు వెల్డింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందించాలని జైలు అధికారులకు సూచించారు. పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని, శిక్షణ పొందిన ఖైదీలు విడుదలైన తర్వాత స్వయంగా ఉపాధి పొందేందుకు, సమాజంలో గౌరవంగా జీవించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అక్కిరెడ్డి నరసింహమూర్తి మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఖైదీల సంక్షేమ దినోత్సవం అందరిలో మానవత్వం, పరివర్తన పట్ల అవగాహన పెంపొందించాలని అన్నారు. జైలులో ఉంటూనే విద్యను అభ్యసించి టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తిచేస్తున్న ఖైదీలను ఆయన అభినందించారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఏఎస్పి సౌజన్య, జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు కమలాకర్, మహేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థం యాగంలో ప్రశాంతమ్మ



కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలం రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వరుణ యాగం నిర్వహించారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఈ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల్లో వర్షాలు సమృద్ధిగా కురవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు ఆమె చెప్పారు.

## శ్రీ కరేశ్వరస్వామి దేవస్థానంలో...



వరుణ యాగంలో పాల్గొన్న సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి-శృతి దంపతులు

తోటపల్లిగూడూరులోని శ్రీ కరేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన వరుణయాగంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు.. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతి దంపతులు పాల్గొని పూజలు చేశారు. వర్షాలు కురిసి రైతులందరూ సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

# గూడూరు డివిజన్



# వర్షాలు కురవాలంటూ వరుణ యాగం



చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ కమిటీ ఛైర్మెన్ మరియు కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం, 1008 కలిశాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, సహస్ర ఘటాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ కోట సతీష్‌యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వరుణ యాగం నిర్వహించామని వెల్లడించారు. కార్య నిర్వహణాధికారి గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే



విజేతలకి బహుమతులందజేస్తున్న డాక్టర్ రోహిణి

చిన్నతనం నుండే విద్యతో పాటు క్రీడల పట్ల కూడా తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలని డాక్టర్ సి.రోహిణి వెల్లడించారు. సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రభాస్ యువసేన ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చెస్ పోటీలు జరిగాయి. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రోహిణి మాట్లాడుతూ చెస్ ఆడడం వల్ల పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ప్రభాస్ ఫ్యాన్స్ ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీనివాసులు రాజు యోగి, భాస్కరనాయుడు, ముమ్మడి వెంకటేశ్వర్లు, మనోజ్, కోటి, జయచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్పీగా నరసింహమూర్తి



గూడూరు సబ్ డివిజన్ పోలీసు అధికారిగా కె.నరసింహమూర్తి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. కాళహస్తిలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీలలో భాగంగా గూడూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తానని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని.. గంజాయి, రౌడీషీటర్లు, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

# ఒకటవ పట్టణ సీఐగా శ్రీనివాస్



గూడూరు ఒకటవ పట్టణ సీఐగా జె.శ్రీనివాస్ ఈ నెల 4న బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గూడూరు రెండో పట్టణ సీఐగా విధులు నిర్వహించారు. బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు.

# ఎస్‌పిఎస్ఆర్ పార్కు వీధిలో.. 'ఆపరేషన్ త్రిశూల్'



ప్రజలకి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహిస్తున్న 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా గూడూరు పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు పార్కు వీధిలో డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, మహిళల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు ప్రజలకి తెలియజేశారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.



# రౌడీషీటర్ల బైండోవర్

రానున్న జెండా పండుగ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించే చర్యల్లో భాగంగా, ఈనెల 6వతేదీ గూడూరు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 10మంది రౌడీషీటర్లను తహసీల్దార్ సమక్షంలో హాజరుపరచి, పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్‌లో భాగంగా, వారు ఎటువంటి నేరాలకు, గొడవలకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడకూడదని స్పష్టంగా హెచ్చరించారు.

# వికలాంగులకి 'రెడ్' నిత్యావసర వస్తువులు



గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ & ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37మంది పేద వికలాంగులకి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గోకరణం జయజ్యోతి - మునీంద్రలు దాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు నిర్మల, సుప్రియ, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.




గూడూరు మున్సిపల్ కమిషనర్ సమక్షంలో నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతులమీదుగా 'స్వచ్ఛ యోధుల పురస్కారాన్ని' అందుకుంటున్న ప్రభుత్వ ఆరోగ్య కార్యకర్త చిన్నకొండయ్య

# కళ్యాణ వైభవం...!




వైసీపీ నాయకుడు, ఆదాల అనుంగు అనుచరుడు స్వర్ణ వెంకయ్య - శ్రీమతి శాంతమ్మల మనుమరాలు, స్వర్ణ జీవన్ ప్రసాద్ - శ్రీమతి ప్రసన్నల కుమార్తె **డా॥ హితిక - సాత్విక్‌కుమార్** ల పరిణయం సెప్టెంబర్ 25వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# మోడీ ప్రజాసేవకు వెల్లువెత్తిన అభినందనలు

## ఆత్మకూరులో 'సేవా జ్యోతి' బైక్ ర్యాలీ

ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ ఆత్మకూరు పట్టణంలో 'సేవా జ్యోతి' పేరుతో ఇటీవల బైక్ ర్యాలీ నిర్వహించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, అనంతరం భారత ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల ప్రజాసేవ చేసిన నరేంద్ర మోడీ గుజరాత్ రాష్ట్రంతో పాటు భారత దేశాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్లి, ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడిగా దేశ ప్రజల గౌరవాన్ని పొందారని నాయకులు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారంతో రాష్ట్రంలో అనేక



అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన మేరకు నిర్వహించిన ఈ బైక్ ర్యాలీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నరేంద్ర మోడీ మరెన్నో సంవత్సరాలు దేశ ప్రధానమంత్రిగా కొనసాగుతూ దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని నాయకులు ఆకాంక్షించారు.

# సరస్వతీసమాజం సేవలు ప్రశంసనీయం

## • మంత్రి నారాయణ కితాబు



విద్యార్థులకి పురస్కారాలను అందజేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు మూలాపేటలోని శ్రీ అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఈనెల 8న మంత్రి నారాయణ చేతులమీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సరస్వతీ సమాజం వారు విద్యార్థుల విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడంతో పాటు, తెలుగు పద్యాలు, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు పెట్టి వారిని తీర్చిదిద్దడం ప్రశంసనీయమన్నారు. అదేవిధంగా, ఈ సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శుభస్వీకరణ భవనాన్ని కూడా అభివృద్ధి చేయడం, అందుకు ప్రజలు సహాయ సహకారాలు అందించడం సంతోషకరమన్నారు. మంత్రి నారాయణ కుమార్తె షరణి, డిప్యూటీమేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పొదలకూరు పోలేరమ్మ జాతర

## • పాల్గొన్న సోమిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు



పోలేరమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, రాజగోపాలరెడ్డి - శృతి దంపతులు, కొమ్మి

మండల కేంద్రమైన పొదలకూరులో ఇటీవల శ్రీ పోలేరమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, సోమిరెడ్డి తనయుడు.. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులు, వారి కుటుంబసభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలసి ఫోటోలు దిగారు. దాదాపు 90 ఏళ్ల తర్వాత పెద్దఎత్తున అమ్మవారికి జాతర నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని సోమిరెడ్డి చెప్పారు. ఇప్పుడు తాను ఎమ్మెల్యేగా ఉన్న ఈ సమయంలోనే ఈ జాతర జరుగుతుండటం తన అదృష్టమన్నారు. అమ్మవారి ఆశీస్సుల కోసం వేలాదిగా భక్తులు తరలిరావడం ఆనందదాయకమంటూ జాతర కమిటీవారికి, భక్తులందరికీ జాతర శుభాకాంక్షలు చెప్పారు.

## జొన్నవాడలో 11 నుండి..

# శరన్నవరాత్రి మహోత్సవాలు



బుచ్చిరెడ్డిపాళెం మండలం, జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 20వతేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 16న సరస్వతీ అలంకారం, 18న దుర్గాష్టమి సందర్భంగా దుర్గా అలంకారం, 19న మహిషాసురమర్దిని అలంకారం, 20న విజయదశమి సందర్భంగా శమీ పూజ, అశ్వవాహనం, ఏకాంతసేవలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## పార్లమెంటరీ పరిశ్రమల కమిటీలో..

# బీఎంఆర్ కొనసాగింపు



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు (బీఎంఆర్) పార్లమెంటరీ కమిటీ ఆన్ ఇండస్ట్రీ సభ్యత్వం 2026-27 సంవత్సరానికి కూడా పునరుద్ధరించబడింది. రాజ్యసభ పార్లమెంటరీ బులెటిన్‌లో ఆమేరకు సెప్టెంబర్ 26, 2026 నుంచి పునర్వ్యవస్థీకరించిన కమిటీ ఆన్ ఇండస్ట్రీలో తన సభ్యత్వాన్ని కొనసాగించినట్లు బీఎంఆర్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో కూడా ఆయన ఈ కమిటీలో సభ్యులుగా కొనసాగారు. ఈ కీలక బాధ్యతను కొనసాగించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# వెంకటేశ్వరపురంలో.. శ్రీ లక్ష్మీనారాయణ హోమం

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 3న శ్రీ లక్ష్మీనారాయణ హోమం, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ భాగవతంలోని "ప్రహ్లాద చరిత్ర" ఘట్టాన్ని భక్తులకు వివరించారు. భాగవతంలోని పోతన పద్యాలను ఆయన రాగయుక్తంగా వినిపించారు. అనంతరం అర్చకులు ఏ.భరద్వాజ్, ఆలయ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, కోశాధికారి కోదండరామయ్య, తెలుగుపండితులు గంగా ప్రసాద్‌లు అవధాని రాజశేఖర్‌ని సన్మానించారు. కీ-బోర్డు వాద్యంతో సహకరించిన వెంపులూరు శీనయ్య, రత్నకుమార్, కొప్పోలు ప్రసాద్ తదితరులను అభినందించారు. అనంతరం శ్రీవారి పల్లకిసేవ, విశేష హారతులు జరిగాయి.



అక్టోబర్ 4వ తేదీ ఆదివారం నగరంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారకాన్ని సందర్శించి వారి విగ్రహం వద్ద నివాళులర్పించిన బాలు చెల్లెళ్ళు ఎస్పీ పార్వతి, ఎస్పీ శైలజ, ఎస్పీ వసంత లు. వారితో వీరిశెట్టి హజరత్ బాబు కూడా వున్నారు.

# డాక్టర్ కరుణాకర్ సేవలు అభినందనీయం



సత్కారాన్నందుకుంటున్న డాక్టర్ కరుణాకర్

కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న ప్రభుత్వ హోమియోపతి హాస్పిటల్‌లో వైద్యులుగా ఉన్న డాక్టర్ కరుణాకర్ 2026-స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ హాస్పిటల్ అవార్డు పొందిన సందర్భంగా ఇటీవల ఆయనను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిరంజన్ బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొల్లా సునీల్‌రెడ్డి, శ్రీ సత్యానంద ఆశ్రమ అధిపతులు పురుషోత్తమ తీర్థస్వామి తదితరులు డాక్టర్ కరుణాకర్ సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో ఆయన మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.


ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ నుండి అవార్డుని స్వీకరిస్తున్న ఉపేంద్ర

# 'చెట్టు=తల్లి'కి మరో అవార్డు!


కళాంజలి అనంత్

నెల్లూరుకు చెందిన కళాంజలి అనంత్ రచన – దర్శకత్వంలో రూపొందించిన సందేశాత్మక లఘు చిత్రం 'చెట్టు=తల్లి' షార్ట్‌ఫిల్మ్‌కి మరో అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ – విజయవాడ వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్‌ల పోటీల్లో 'చెట్టు=తల్లి' ఉత్తమ ద్వితీయ చిత్రంగా అవార్డును గెలుచుకుంది. విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు మురళీమోహన్, ప్రసిద్ద సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా, ఆ చిత్రంలో హీరోగా నటించిన ఉపేంద్ర ఆ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అనంత్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవాలి, మొక్కలు నాటుకోవాలే తప్ప చెట్లను నరకకూడదనే సందేశంతో ఈ షార్ట్‌ఫిల్మ్‌ని రూపొందించామని తెలిపారు. 'చెట్టు=తల్లి'ఇప్పటికే రాష్ట్రస్థాయిలో 6 అవార్డులు సాధించిందని, ఇది 7వది అని ఆయన చెప్పారు. ఇందులో నటీనటులు దువ్వూరు బెనర్జీ, డా.కెకెఆర్ మూర్తి, సుఫియా, ఉపేంద్ర, బయ్యా వాసు, శిరీష, నీలిమ, గవాస్కర్ తదితరులు నటించగా, గీత రచయిత మద్దూరు శ్రీనివాసులు , సంగీత్ సౌరభ్ సంగీతం, ఎడిటింగ్ రాజేష్ తదితరులందరి సహకారంతో ఈ షార్ట్‌ఫిల్మ్ ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో పలు అవార్డులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

# చల్లా యానాదులకు అండగా నిలిచిన కలెక్టర్


గిరిజనులకి ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, బాలచెన్నయ్య

దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపునకు నోచుకోని చల్లా యానాదులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అండగా నిలిచారు. ఈనెల 5న కోవూరు సమీపంలోని సాలుచింతల వద్ద సుమారు 40ఏళ్లుగా ఇటుక బట్టీల్లో పని చేసుకుంటూ బతుకుతున్న చల్లా యానాది గిరిజన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని, వారి సమస్యలను డాక్టర్ అంబేద్కర్ సొసైటీ ఫర్ యూత్ అండ్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బాలచెన్నయ్య కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఆ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, రేషన్ కార్డులు అందేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కోవూరు హైవే సమీపంలోని నందలగుంట వద్ద 30 మంది గిరిజన కుటుంబాలకు ఇంటి నివేశస్థలాలు మంజూరు చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్లో బాలచెన్నయ్యతో కలిసి, గిరిజన కుటుంబాలకు ఇంటి నివేశస్థలాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. నందలగుంట ప్రాంతంలో వీధిలైట్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గిరిజన కుటుంబాలకు గుర్తింపు కల్పించడంతో పాటు వారికి అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# లక్ష్యాలను సాధించాలి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ఎస్‌కె ఖాదర్‌వలి సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6న నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న డీఎఫ్ఐటీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ, ఆయా వ్యాధులకు సంబంధించిన కేసులను గుర్తించాలని ఆయన చెప్పారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, టీబీ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# విజయం కోసం పనిచేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

రానున్న స్థానిక ఎన్నికల్లో విజయం కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దామని నగర వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. ఈనెల 6న నెల్లూరులోని వైసీపీ కార్యాలయంలో ఆయన ఆ పార్టీ డివిజన్ల నాయకులతో సమావేశమై మాట్లాడారు. టిక్కెట్ ఎవరికి వచ్చినా, అందరం కలసి విజయానికి కృషిచేద్దామని చెప్పారు. వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొణిదల సుధీర్, జయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'మహాభారతం' ఉపన్యాసాలు


సత్కారాన్నందుకుంటున్న డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు

నెల్లూరులోని పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఈనెల 6వతేదీ వరకు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామ స్వామి మందిరంలో మహాభారతంపై ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిగాయి. ప్రతిరోజూ భక్తులు అధిక సంఖ్యలో మందిరానికి వచ్చి ఈ ఉపన్యాసాలను ఆసక్తిగా విన్నారు. ప్రముఖ కవి పండితులు కోట రాజశేఖర్, డాక్టర్ ఐనవోలు శ్రీనివాస చక్రపాణి, శ్రీరామ చంద్రుని శ్రీనివాసరావు, డాక్టర్ గిరిజాలక్ష్మి, ఇనమన మెళ్ళూరు నాగరాజారావు, దర్శి బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య మహాభారతంలోని వివిధ ఘట్టాలను వివరించారు. చివరిరోజైన ఈనెల 6న పద్య సారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు 'నలచరిత్ర'ను నైషధాదులతో సమన్వయం చేసి అద్భుతంగా వివరించారు. పలువురు సభాపోషకులు ఉపన్యాసకులను సన్మానించారు. దాతలు సాయికుమార్–శారదలు ప్రతిరోజూ భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

# ఆధ్యాత్మిక ఆణిముత్యం.. 'పోలూరి'వారు



కీర్తిమూర్తులు

ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, వేదాంతవేత్త, మరియు ఆదర్శ అధ్యాపకులయిన పోలూరి హనుమజ్జానకీ రామశర్మ నెల్లూరు వి.ఆర్. కాలేజీలో తెలుగు శాఖాధిపతిగా 37 సంవత్సరాలు పనిచేశారు. వీరు నిత్యం కఠిన నియమ నిష్టలతో జపతపాలు చేసుకుంటూనే అనేక విశిష్ట ఆధ్యాత్మిక, వేదాంత గ్రంథాలను రచించారు. ప్రకాశం జిల్లా వెన్నూరులో అక్టోబరు 13, 1924 సం.లో వేంకట నరసమ్మ. వేంకట నారాయణ రావులకు జన్మించిన వీరు నరసరావుపేటలో ప్రాథమిక విద్య, గుంటూరు ఏ.సి.కాలేజీలో బి.ఏ.ఆనర్స్ (1942–45) చదువుతూ పింగళి లక్ష్మీకాంతం, గంటిజోగి సోమయాజులు, దువ్వూరి వేంకటరమణ శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మల దగ్గర చదువులలో గొప్ప పాండిత్యం సంపాదించారు.

## 'నడిచే విజ్ఞాన సర్వస్వం'.. పోలూరి వారు

పోలూరి వారు బహుగ్రంథ కర్త. అపార జ్ఞాన సంపన్నులు. ఆయన్ను అందరూ 'నడిచే విజ్ఞాన సర్వస్వం' అని కీర్తించేవారు. ఆయన రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలలో త్రిపుర రహస్య జ్ఞానఖండ సారము, శ్రీ కావ్యకంఠ గణపతి ముని చరిత్ర అత్యంత ప్రామాణికమైన గ్రంథాలు. శ్రీ దత్తాత్రేయుడు పరశురామునికి ఉపదేశించిన అత్యున్నత అద్వైత వేదాంత గ్రంథం "త్రిపుర రహస్యం". ఇందులోని క్లిష్టమైన జ్ఞానఖండాన్ని ముముక్షువులకు సులభంగా అర్థమయ్యే రీతిలో శర్మ తెలుగులో తాత్పర్యం మరియు విశేష వివరణలతో అందించారు. రమణ మహర్షి ప్రధాన శిష్యులైన కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని జీవిత విశేషాలు, ఆయన తపస్సు, సాహిత్య ప్రతిభను వివరిస్తూ శర్మగారు రాసిన అత్యంత ప్రామాణికమైన జీవిత చరిత్ర గ్రంథం కూడా ప్రధానమైనది. ఇంకా తిరుమల క్షేత్రంలో ప్రతిరోజూ పఠించే సుప్రభాతం, ప్రపత్తి, మంగళాశాసన శ్లోకాలకు అద్భుతమైన వ్యాఖ్యానాన్ని "శ్రీ వేంకటేశ్వర సుప్రభాత వ్యాఖ్యానం" పేరుతోను, శ్రీకృష్ణుని లీలలు, ఉద్యోగ పర్వ విశేషాలు మరియు భగవద్గీతలోని వేదాంత సారాన్ని కావ్య రూపంలో, సరళ శైలిలో శ్రీ వాసుదేవ కథాసుధ పేరుతో అందించారు.

## మన వెంకయ్యనాయుడుకి గురువు

మాజీ ఉపరాష్ట్రపతి, నెల్లూరు ముద్దుబిడ్డ.. ముప్పవరపు వెంకయ్య నాయుడు గతంలో నెల్లూరు వీఆర్ కళాశాలలో డిగ్రీ చదివే రోజుల్లో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ, వారికి తెలుగు ఆచార్యులుగా ఉండేవారు. తమ గురువు ప్రేరణ వల్లే తనకు తెలుగుభాషపై మక్కువ, ధారాళంగా మాట్లాడే నేర్పు వచ్చాయని వెంకయ్యనాయుడు ఇప్పటికీ పలు సందర్భాల్లో గుర్తుచేసుకుంటుంటారు. తన గురువుపై ఉన్న అపారమైన గౌరవంతో వెంకయ్య నాయుడు ఆయన పేరిట ప్రత్యేకంగా ఒక పురస్కారాన్ని కూడా నెలకొల్పారు. వెంకయ్యనాయుడు కుటుంబానికి చెందిన స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్తంగా సాహిత్య, సంస్కృతి రంగాలలో విశేష కృషి చేసిన ప్రముఖులకు ఏటా 'పోలూరి హనుమజ్జానకీ రామశర్మ పురస్కారాన్ని' అందజేస్తూ ఆయనను గౌరవిస్తున్నాయి. రాజకీయ జీవితంలో ఎంత తలమునకలై ఉన్నప్పటికీ, వెంకయ్యనాయుడు తన గురువు అందించిన విద్యాబుద్ధులను స్మరించుకుంటూ ఈ ట్రస్ట్ కార్యక్రమాల ద్వారా నేటి తరానికి గురుభక్తి విశిష్టతను చాటిచెబుతున్నారు.

## పోలూరి వారి రచనలు.. దివ్యజ్ఞాన ప్రసూనాలు

పోలూరి హనుమజ్జానకీ రామశర్మ తెలుగు భాషా వనాన విరిసిన జ్ఞానప్రసూనమై, వేద విద్యా ధార్మిక పథాన సాగిన దివ్య చైతన్యమై, గురు శిష్య బంధానికి నిలిచిన నిలువెత్తు రూపమై, నిరుపమానమైన ఆధ్యాత్మిక సేవలతో తెలుగు నేలకు శాశ్వత దీపంగా నిలిచిన వారు.

తెలుగు సంస్కృతి, సనాతన ధర్మం మరియు ఆధ్యాత్మిక విలువలపై అనేక రచనలు చేసి, సమాజంలో నైతికతను పెంపొందించడానికి ఎంతో కృషి చేశారు. వీరు 2005, జనవరి 10వ తేదీన స్వర్గస్తులయ్యారు. వీరి శతజయంతిని 2024 సం.లో శిష్యులు ఏడాది పొడవునా జరుపుకొని ఆయన ఆధ్యాత్మిక స్ఫూర్తిని ప్రచారంలోకి తేవడం విశేషం!

(అక్టోబరు 13,
పోలూరి హనుమజ్జానకీరామశర్మ జయంతి)



డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
ఫోన్: 9490400858

# వీరుడా!.. వందనం!


భారతీయ పైలెట్ స్మిత్ మచ్చార్

అరాచకత్వమే రాక్షసునిగా మారి
హతమార్చడానికి ప్రయత్నిస్తుంటే
నీ ప్రాణాలను సైతం లెక్కచేయక
వీరునిగా ధైర్యంతో పోరాడావు
ప్రయాణీకులందరి ప్రాణాలు కాపాడావు.

వృత్తిని గాలికొదిలేసే ప్రవృత్తి లేకుండా
అంతటి విపత్తులోనూ ధీరుడవయ్యావు
ఒంటినుండి నెత్తుటి ధారలు ప్రవహిస్తున్నా
భారతీయుల సాహసానికి ప్రతీకగా నిలిచావు
సాధారణ పైలెట్‌వే అయినా..
సాహస ప్రపంచానికే హైలెట్‌వి అయ్యావు

నీ ధైర్య సాహసాలు అసమానం
నీ త్యాగనిరతి నిరుపమానం
భారతీయతకి నువ్వే ఒక నిదర్శనం
భరతజాతికే నువ్వు గర్వకారణం
ఓ యోధుడా!..
అందుకే మా వందనం!..
అందుకో మా అభివందనం!

పై దుబాయ్ విమానంలో ఓ ముష్కరుడు కత్తితో నరుకుతున్నా ధైర్యంగా పోరాడి 174 మంది ప్రయాణీకుల ప్రాణాలు కాపాడిన భారతీయ పైలెట్ స్మిత్‌మచ్చార్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ..



అభివందనాలతో!...
బొగ్గరపు రాధాకృష్ణమూర్తి
98854 81939

# నెల్లూరులో..'అధునాతన స్టేడియం'

## • శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ



స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగర నియోజకవర్గంలో క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోసేలా స్టేడియం నిర్మాణానికి పురపాలక మంత్రి నారాయణ శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో అధునాతన క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఆయన ఇటీవల శంకుస్థాపన చేశారు. అదే ప్రాంగణంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులకు భూమిపూజ చేసి, మొక్కలు నాటారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా రోడ్లను శుభ్రం చేసి, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు కూడా అందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. అధునాతన క్రికెట్ స్టేడియంతో పాటు క్రీడలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసి కాలేజీ ప్రాంగణాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, కార్పొరేషన్ కమిషనర్ నందన్, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రామారావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు దొడ్డపనేని రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన 'విశ్వసాయి' విద్యార్థులు



క్రీడాకారులని అభినందిస్తున్న విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ సత్యనారాయణ

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో తమ సత్తా చాటుకున్నారు. తమ కళాశాల విద్యార్థులు క్రీడల్లోనూ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి అంతర్జాతీయ క్రీడలకు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ తెలిపారు. గోవాలో సెప్టెంబరు 29, 30 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి 6వ వైఎస్‌పీఏ నేషనల్ ఫెడరేషన్ కప్-2026 పోటీల్లో క్రికెట్ విభాగంలో తమ కళాశాల విద్యార్థులు డి.భవన్, వి.హర్షిత్, ఎం.రిషి, ఎం.మోహన్‌కృష్ణలు మొదటి స్థానం సాధించగా, వాలీబాల్ విభాగంలో ఏ.కార్తీక్, ఎన్.చరణ్‌లు ప్రథమస్థానంలో నిలిచి, డిసెంబరు 2వ వారం భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ క్రీడల పోటీలకు ఎంపికయ్యారంటూ, ఆ విద్యార్థులను ఆయన అభినందించారు. వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, విశ్వసాయి కళాశాల కేవలం చదువులకే కాదు, క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ శివసంకేత్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



## నెల్లూరు నేల నుంచి సినీ ఆకాశానికి..

# ప్రయోగాల సింగీతం ఇక లేరు

*నెల్లూరు జిల్లా ముద్దుబిడ్డగా పుట్టి భారతీయ సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావు ఇక లేరు. 95ఏళ్ల వయసులో వృద్ధాప్య సమస్యలతో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో అక్టోబర్ 3న ఆయన కన్నుమూశారు. ఒక దర్శకుడిగా మాత్రమే కాకుండా రచయితగా, సంగీత దర్శకుడిగా, ప్రయోగశీలిగా, కొత్త ఆలోచనలకు నాంది పలికిన సృజనకర్తగా సింగీతం శ్రీనివాసరావు భారతీయ చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.*



### నెల్లూరు నేలపై పుట్టి...

1931 సెప్టెంబరు 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జన్మించిన సింగీతం శ్రీనివాసరావు బాల్యం నుంచే కళల పట్ల ఆసక్తిని పెంచుకున్నారు. నెల్లూరు జిల్లా నేల నుంచి బయలుదేరిన ఆయన తన ప్రతిభతో తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా తమిళ, కన్నడ చిత్రసీమల్లోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నెల్లూరుజిల్లా అంటే సాహిత్యం, కళలు, సంగీతం, రంగస్థలం, సినిమా రంగాలకు ఎందరో ప్రతిభావంతులను అందించిన నేల. ఆ పరంపరలో సింగీతం శ్రీనివాసరావు పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఉదయగిరిలో పుట్టిన ఒక బాలుడు భారతీయ సినీ రంగంలో ప్రయోగాలకు పర్యాయపదంగా ఎదగడం నెల్లూరుజిల్లాకే గర్వకారణం.

### మూస ధోరణులకు భిన్నంగా...

సింగీతం దర్శకత్వ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఆయనలోని సృజనాత్మకత ఎంత విస్తృతమైనదో అర్థమవుతుంది. సందేశాత్మక చిత్రాల నుంచి హాస్యభరిత చిత్రాల వరకు, చారిత్రక-జానపద కథల నుంచి సైన్స్ ఫిక్షన్ వరకు, మూకీ చిత్రం నుంచి యానిమేషన్ వరకు ఆయన చేసిన ప్రయోగాలు భారతీయ సినిమా పరిధిని విస్తరించాయి. 'సొమ్మొకడిది సోకొకడిది', 'పంతులమ్మ', 'మయూరి', 'పుష్పక విమానం', 'ఆదిత్య 369', 'భైరవద్వీపం', 'మైఖేల్ మదన కామరాజు' వంటి చిత్రాలు ఆయన వైవిధ్యానికి నిదర్శనాలు. ఒకే తరహా కథలతో ప్రేక్షకులను మెప్పించాలనే ప్రయత్నం కాకుండా, ప్రతి సినిమాతో కొత్తదనాన్ని చెప్పాలన్న తపన సింగీతం ప్రత్యేకత. అందుకే ఆయనను కేవలం దర్శకుడిగా కాకుండా 'ప్రయోగాల దర్శకుడు'గా సినీ అభిమానులు గుర్తుంచుకుంటారు.

### 'పుష్పక విమానం'... మాటలు లేకుండానే సంచలనం

1988లో వచ్చిన 'పుష్పక విమానం' సింగీతం సృజనాత్మకతకు అత్యుత్తమ ఉదాహరణ. మాటలు లేకుండా కేవలం హావభావాలు, సంగీతం, దృశ్యాలతో కథను చెప్పి ప్రేక్షకులను మెప్పించడం సాధారణ విషయం కాదు. భాషలకు అతీతంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం సింగీతం ఆలోచనా పరిధిని ప్రపంచానికి పరిచయం చేసింది. మాటలు లేకపోయినా సినిమా మాట్లాడగలదని నిరూపించిన దర్శకుడు సింగీతం.

### నెల్లూరు గర్వించాల్సిన బిడ్డ!

సింగీతం శ్రీనివాసరావు మరణం తెలుగు సినీ పరిశ్రమకు మాత్రమే కాదు నెల్లూరుజిల్లాకు కూడా తీరని లోటు. ఉదయగిరిలో జన్మించిన ఒక వ్యక్తి తన ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ప్రతి నెల్లూరువాసి గర్వించాల్సిన విషయం. మన జిల్లాకు చెందిన మహనీయులు, కళాకారులు, సాహితీవేత్తలు, శాస్త్రవేత్తల గురించి నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. ఆ జాబితాలో సింగీతం శ్రీనివాసరావు పేరు ప్రముఖంగా నిలవాలి. ఆయన సినీ ప్రస్థానం నెల్లూరు జిల్లా యువతకు స్ఫూర్తిగా నిలవాలి. ఉదయగిరి నేలపై మొలకెత్తిన ఆ సృజనాత్మక మొక్క భారతీయ సినిమా ఆకాశంలో మహావృక్షంగా ఎదిగింది. ప్రయోగం అంటే భయపడకుండా, కొత్త ఆలోచనలకు తెరతీసి, ప్రేక్షకుడిని కొత్త అనుభూతికి తీసుకెళ్లిన సింగీతం ఇక మన మధ్య లేకపోయినా ఆయన సినిమాలు, ఆలోచనలు, ప్రయోగాలు ఎప్పటికీ జీవించే ఉంటాయి.

### కాలాన్ని దాటి ప్రయాణించిన 'ఆదిత్య 369'!

తెలుగు సినిమా చరిత్రలో సైన్స్ ఫిక్షన్ కథాంశాన్ని అద్భుతంగా తెరకెక్కించిన చిత్రాల్లో 'ఆదిత్య 369'కి ప్రత్యేక స్థానం ఉంది. కాలయానం అనే వినూత్న అంశాన్ని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తూ చరిత్ర, భవిష్యత్తు, వినోదం అన్నింటినీ కలిపి ఆయన చేసిన ప్రయోగం అప్పట్లోనే విశేష ప్రశంసలు అందుకుంది. సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉన్న కాలంలోనే ఇలాంటి కథను తెరపై ఆవిష్కరించడం సింగీతం దూరదృష్టికి నిదర్శనం.

### 'లాయర్'తో అనుబంధం!

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాల రెడ్డికి సింగీతం శ్రీనివాసరావు ఆప్తమిత్రులు. రాజగోపాలరెడ్డి 1950వ దశకంలో నిర్మాతగా, నటుడిగా సినీ రంగంలో తన ప్రస్థానాన్ని సాగించే రోజులనుండీ వాళ్లిద్దరికీ పరిచయం వుంది. 1987లో 'లాయర్' పత్రిక 6వ వార్షికోత్సవం సందర్భంగా సింగీతం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా కూడా విచ్చేశారు.

నెల్లూరు నేల తన ముద్దుబిడ్డను కోల్పోయింది. తెలుగు సినిమా ఒక మహా ప్రయోగశీలిని కోల్పోయింది. భారతీయ చలనచిత్ర రంగం ఒక సృజన శిఖరాన్ని కోల్పోయింది. నెల్లూరుజిల్లా ఖ్యాతిని సినీ ప్రపంచంలో చాటిన దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావుకి 'లాయర్' ఘన నివాళి.

### 'మయూరి'లో ప్రతిభకి పట్టం!

నృత్యకారిణి సుధాచంద్రన్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'మయూరి' మరో మైలురాయి. వైకల్యాన్ని జయించి జీవితంలో ముందుకు సాగిన ఒక కళాకారిణి పోరాటాన్ని స్ఫూర్తిదాయకంగా తెరకెక్కించారు. వినోదంతో పాటు స్ఫూర్తిని అందించగల సినిమా ఎలా ఉండాలో ఈ చిత్రం చూపించింది.

### బహుముఖ ప్రజ్ఞాశాలి!

సింగీతం కేవలం దర్శకుడు మాత్రమే కాదు. రచయితగా, కథకుడిగా, సంగీత దర్శకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు వద్ద శిష్యరికం చేసిన ఆయన సంగీతంపై కూడా మంచి పట్టు సాధించారు. కన్నడలో 'భాగ్యద లక్ష్మీ బారమ్మ', 'సంయుక్త' వంటి చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించడం ఆయనలోని మరో కోణాన్ని తెలియజేస్తుంది. ప్రవాస భారతీయుల పిల్లల కోసం సంస్కృత శ్లోకాలను ఆంగ్లంలో సంగీతబద్ధం చేయడం వంటి కార్యక్రమాలు కూడా ఆయనలోని సృజనాత్మకతకు నిదర్శనం.

### 94 ఏళ్ల వయసులోనూ కెమెరా వెనుకే!

సినిమా పట్ల ఆయనకున్న ప్రేమకు వయసు ఎప్పుడూ అడ్డుకాలేదు. జీవితపు చివరి దశలో కూడా సృజనాత్మకతను వదలని సింగీతం, వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా కెమెరా వెనుక నిలిచారు.తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో చివరి దశ వరకు దర్శకత్వం వహించడం ఆయనలోని కళాతపనకు నిదర్శనం. వయసు శరీరానికే తప్ప సృజనాత్మకతకు కాదని తన జీవితంతో నిరూపించిన కళాకారుడు సింగీతం.



Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com